పెన్ పవర్

12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు

విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టీ. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 1 సంచిక :300 పేజీలు :8 | సంపాదకులు : జి.ఎ.రావు (ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : తిరుపతి | బుధవారం 4 నవంబర్ 2026 | వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE :300 PAGES :8 | EDITOR : G. A. RAO (ANAND GANTYADA) | PUBLISHED : TIRUPATI | WED 4 NOVEMBER 2026 | PRICE : 5/- RS

Simultaneously Published form Tirupati, Chittoor,Srikakulam,Ongole,Visakhapatnam,Kakinada,West Godavari,Bapatla,Narasarao Peta, Ongole, SPSR Nellore, Tirupati, YSR Kadapa,Circulated by : manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur,Kurnool,Anantapur



ఏపీ మున్సిపల్ ఎన్నికల్లో టీడీపీ కూటమి హవా.. జగన్‌కు షాక్!

పులివెందులలోనూ టీడీపీ విజయం.. తిరుపతి మేయర్ పీఠం కైవసం.. పలు మున్సిపాలిటీల్లో కూటమి అభ్యర్థుల గెలుపు

కడప జిల్లాలో 4 మున్సిపాలిటీలు టీడీపీ కైవసం.. బీజేపీ ఖాతాలో ఒకటి!

- జగన్ సొంత జిల్లా కడపలో వైసీపీకి ఎదురుదెబ్బ
- బద్వేల్, రాజంపేట, రాయచోటి, మైదుకూరు పురపాలికలు టీడీపీ కైవసం
- యర్రగుంట్ల మున్సిపాలిటీని గెలుచుకున్న బీజేపీ
- జిల్లాలో ఖాతా కూడా తెరవలేకపోయిన వైసీపీ

కుప్పంలో టీడీపీ క్లీన్ స్వీప్.. వైసీపీకి సున్నా

- మొత్తం 32 వార్డులను కైవసం చేసుకున్న టీడీపీ అభ్యర్థులు
- వైసీపీకి ఘోర పరాభవం
- ఫలితాలతో సంబరాల్లో మునిగిన టీడీపీ కార్యకర్తలు

- మిగతా 2లో

కార్పొరేషన్లు, మున్సిపాలిటీలపై కూటమి జెండాల రెపరెపలు

- మున్సిపల్ ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఘన విజయం
- వైఎస్ జగన్ సొంత నియోజకవర్గం పులివెందులలో టీడీపీ చారిత్రక గెలుపు
- విశాఖ, విజయవాడ సహా 10కి పైగా కార్పొరేషన్లు ఎన్డీయే కైవసం
- ఒక్క నందికొట్కూరు మున్సిపాలిటీకే పరిమితమైన వైసీపీ
- ఇది ప్రజా విజయమన్న చంద్రబాబు, ఎన్నిక కాదు ఎంపిక అని ఆరోపించిన జగన్

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపల్ ఎన్నికల ఫలితాలు మంగళవారం వెలువడుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 92 పట్టణ స్థానిక సంస్థల్లో జరిగిన ఎన్నికల ఓట్ల లెక్కింపు నవంబర్ 3న ఉదయం 8 గంటలకు ప్రారంభమైంది. ఈ ఎన్నికల్లో అధికార టీడీపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి పలు పట్టణ స్థానిక సంస్థల్లో ఆధిక్యం సాధించడంతో పాటు కీలక విజయాలను నమోదు చేసింది. మరోవైపు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి కొన్ని ప్రాంతాల్లో ఎదురుదెబ్బ తగిలింది.

ఇది సుపరిపాలనకు దక్కిన విజయం



- స్థానిక ఎన్నికల ఫలితాలపై స్పందించిన సీఎం చంద్రబాబు
- సుపరిపాలనను చూసే ప్రజలు కూటమికి ఓటేశారని వెల్లడి
- రాజకీయాల కన్నా ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యత అని ఉద్ఘాటన
- అమరావతి, పోలవరం పనులను వేగవంతం చేశామని వివరణ
- ప్రజలు మెచ్చే పాలన అందించడమే తమ లక్ష్యమని స్పష్టీకరణ

కంగ్రాట్స్ చంద్రబాబు టీమ్!

- మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై స్పందించిన వైసీపీ అధినేత జగన్
- చంద్రబాబు, పోలీసులు, ఎస్ఈసీకి కంగ్రాట్స్ అంటూ వ్యంగ్యం
- ఇవి ఎన్నికలు కాదని, ఏకపక్షంగా జరిగిన సెలక్షన్లని ఆరోపణ
- నామినేషన్ల నుంచి కౌంటింగ్ వరకు ప్రక్రియను హైజాక్ చేశారని విమర్శ
- ఎన్నికల సంస్కరణల ఆవశ్యకత స్పష్టమైందని వ్యాఖ్య



పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో అధికార కూటమి ప్రభంజనం సృష్టిస్తున్న వేళ, వైసీపీ అధినేత జగన్ సోషల్ మీడియా వేదికగా ఘాటుగా స్పందించారు. ఎన్నికల ప్రక్రియ ఏకపక్షంగా జరిగిందని ఆరోపిస్తూ, ఇవి ఎలక్షన్లు కావని, సెలెక్షన్లు అని ఆయన వ్యంగ్యం ప్రదర్శించారు. చంద్రబాబు, పోలీసులు, రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ఉద్దేశించి జగన్ వ్యంగ్యంగా అభినందనలు తెలిపారు. "ప్రతిపక్షానికి

- మిగతా 2లో

ఈవీఎం అయినా, బ్యాలెట్ అయినా..

విజయం కూటమిదే



పెన్ పవర్ డెస్క్: పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల ఫలితా లపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించారు. "నగర పాలక, పుర పాలక, నగర పంచాయతీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు దక్కిన అఖండ విజయాలు మా ప్రభుత్వ పాలనకు మద్దతుగా భావిస్తున్నాం. ఇది ఎంతో అమూల్యమైన తీర్పు. మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు విషయంలో కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల పట్ల పట్టణ ప్రజలు విశ్వాసం కనబరుస్తున్నారనడానికి ఈ ఫలితాలే నిదర్శనం. సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి పాలైన పార్టీ ఈవీఎంలను నిందించింది.

- మిగతా 2లో



24 గంటలు గడుస్తోంది.. ఏమైపోయారు మోదీజీ

పెన్ పవర్ డెస్క్:విదేశీ శక్తుల కోసం గంటలు గడుస్తోంది.. బహిరంగ ఎవరు పనిచేస్తున్నారో.. ఎవరు దేశ ద్రోహినో తేల్చేద్దాం రండి అంటూ ఓపెన్ డిబేట్ కు సవాల్ చేసిన లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ.. మరోసారి తన ఛాలెంజ్ ను గుర్తు చేశారు. నేను ఛాలెంజ్ చేసి 24 చర్చకు రాలేదేంటి మోదీగారు.. అంటూ మరో ట్వీట్ చేశారు. 2026 నవంబర్ 3న ప్రధాని నరేంద్ర మోదీకి మళ్లీ ఓపెన్ డిబేట్ సవాలు విసిరారు రాహుల్.

- మిగతా 2లో

మురసు తుపాను ఎఫెక్ట్..

చిలకలూరిపేట హైవేపై వరద నీరు, విజయవాడలో ఎడతెరిపిలేని వాన

- మురసు తుపాను ప్రభావంతో పల్నాడు జిల్లాలో భారీ వర్షాలు
- చిలకలూరిపేటలో జాతీయ రహదారిపైకి చేరిన వరద నీరు
- విజయవాడలో 10 గంటలుగా కురుస్తున్న వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయం
- బుడమేరుకు మళ్లీ వరద వస్తుందని ప్రజల్లో భయాందోళనలు

- మిగతా 2లో





రాహుల్ గాంధీ నిద్రపోతున్న పోస్టర్లు.. కోల్‌కతా సాల్ట్ లేక్ లో కలకలం!

- కోల్‌కతాలో రాహుల్ గాంధీకి వ్యతిరేకంగా పోస్టర్లు
- పార్లమెంట్‌లో నిద్రపోతున్నట్లుగా ఉన్న చిత్రాలతో ప్రచారం
- "దేశ నాయకుడు ఇలాగేనా ఉండేది?" అంటూ పోస్టర్లపై నినాదం
- ఓటర్ల జాబితాపై రాహుల్ ఆందోళన చేస్తున్న సమయంలో ఈ పరిణామం

- మిగతా 2లో

- ఈ పోస్టర్ల వెనుక ఎవరున్నారనే దానిపై వీడని సస్పెన్స్

భార్యను తెలివి తక్కువది అనడం క్రూరత్వం కాదు..

సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు



- మిగతా 2లో

అణు దాడి జరిగితే 24 గంటలు

బయటకు రావొద్దు..

ప్రజలకు ఇరాన్ సంచలన సూచనలు!

- అణు దాడి నుంచి రక్షణకు ఇరాన్ 8 నిమిషాల వీడియో విడుదల
- కనీసం 24 గంటలు ఆశ్రయంలోనే ఉండాలని సూచన
- ఏసీలు, బయట గాలిని తెచ్చే వెంటిలేషన్ వ్యవస్థలు ఆపేయాలంటూ వీడియో
- కిటికీలకు దూరంగా బేస్‌మెంట్లలో ఆశ్రయం పొందాలని సూచన
- పికాక్స్ మౌంటెయిన్‌పై అమెరికా దాడి ఊహాగానాల వేళ మార్గదర్శకాల విడుదల

- మిగతా 2లో



ఇది సంబరాలకు కాదు, సేవకు సమయం

పురపాలిక తీర్పుపై నారా లోకేశ్

- పురపాలిక తీర్పును వినయంతో స్వీకరిస్తున్నామని తెలిపిన మంత్రి లోకేశ్
- గత రెండున్నరేళ్ల సుపరిపాలనకు ప్రజలిచ్చిన ఆశీర్వాదమే ఈ విజయమన్న లోకేశ్
- గెలుపొందిన టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థులకు అభినందనలు
- అహంకారానికి తావులేదని, పార్టీలకతీతంగా అందరికీ సేవ చేస్తామని స్పష్టీకరణ



పెన్ పవర్ డెస్క్:పురపాలిక ఎన్నికల ఫలితాలు సంబరాలు చేసుకోవడానికి కాదని, ప్రజలకు మరింత సేవ చేసేందుకు లభించిన అవకాశమని రాష్ట్ర మంత్రి, టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ స్పష్టం చేశారు.

- మిగతా 2లో

ఎడిటర్ వ్యూ

అణు దాడి జరిగితే 24 గంటలు
బయటకు రావొద్దు..

అమెరికా దాడి చేస్తుందనే ఆందోళనల నేపథ్యంలో ఇరాన్ ప్రభుత్వం ప్రజలకు అరుదైన అణు దాడి రక్షణ మార్గదర్శకాలను విడుదల చేసింది. ఎనిమిది నిమిషాల నిడివి ఉన్న వీడియోలో అణు విస్ఫోటనం జరిగితే ఎలా ప్రాణాలు కాపాడుకోవాలో వివరించింది. భవనాల బేస్‌మెంట్లు, కిటికీలు లేని లోపలి గదుల్లో ఆశ్రయం పొందాలని, తలుపులు, కిటికీలు మూసివేయాలని సూచించింది. బయట గాలిని లోపలికి తీసుకొచ్చే ఏసీలు, వెంటిలేషన్ వ్యవస్థలను నిలిపివేయాలని తెలిపింది. దాడి తర్వాత కనీసం 24 గంటల పాటు ఆశ్రయంలోనే ఉండాలని, ప్యాక్ చేసిన ఆహారం, సీసాల్లోని నీటిని మాత్రమే వినియోగించాలని హెచ్చరించింది. ఈ మార్గదర్శకాలను ఇరాన్ అధికారిక వార్తా సంస్థ ఐఆర్ఎన్ఏ అక్టోబర్ 29న ప్రచురించింది.ఒకవేళ అణు విస్ఫోటనం సమయంలో ఎవరైనా బయట ఉంటే.. పేలుడు వెలుగును నేరుగా చూడొద్దని, నేలపై పడుకుని తల, ముఖాన్ని కాపాడుకోవాలని సూచించింది. పేలుడు ప్రభావం తగ్గిన తర్వాత సమీపంలోని బలమైన భవనంలోకి వెళ్లాలని తెలిపింది. వాహనాల్లో ఆశ్రయం పొందడం సురక్షితం కాదని స్పష్టం చేసింది. రేడియోధార్మిక ధూళి శరీరంపై పడితే బయట దుస్తులను జాగ్రత్తగా తొలగించి, మూసిన సంచిలో ఉంచాలని, చర్మం, జుట్టును సబ్బు, గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలని సూచించింది. రేడియేషన్ ప్రభావం తగ్గించేందుకు వాడే అయోడిన్ మాత్రలను వైద్యుల సలహా లేకుండా తీసుకోవద్దని హెచ్చరించింది. అధికారిక సమాచారం కోసం బ్యాటరీతో పనిచేసే రేడియోలను సిద్ధంగా ఉంచుకోవాలని కూడా పేర్కొంది. ఇరాన్‌లోని ఇస్ఫహాన్ ప్రావిన్స్ అత్యవసర సేవల విభాగం రూపొందించిన ఈ వీడియో వెలువడటం అంతర్జాతీయంగా చర్చనీయాంశమైంది. నతాంజ్ అణు కేంద్రానికి సమీపంలోని పికాక్స్ మౌంటెయిన్‌పై అమెరికా దాడి చేసే అవకాశం ఉందన్న ఊహాగానాల మధ్య ఈ సూచనలు వచ్చాయి. అక్టోబర్ 16న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆ ప్రాంతాన్ని లక్ష్యంగా చేసుకునే అవకాశాన్ని ప్రస్తావించినప్పటికీ, అణ్వాయుధాలు ఉపయోగించబోమని స్పష్టం చేశారు.ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఈ దాడి కోసం అమెరికాపై ఒత్తిడి తెస్తున్నారంటూ జర్నలిస్ట్ టక్కర్ కార్ల్‌సన్ చేసిన ఆరోపణలు కూడా ఈ చర్చకు మరింత ప్రాధాన్యం తెచ్చాయి. అయితే ఈ మార్గదర్శకాలు ఇరాన్ నిర్వహిస్తున్న పౌర రక్షణ వారోత్సవాల్లో భాగంగా విడుదలయ్యాయని సమాచారం.

కంగ్రాట్స్ చంద్రబాబు టీమ్!

- మొదటి పేజి తరువాయి

పోటీ చేసే అవకాశమే ఇవ్వకుండా ఎన్నికల్లో అద్భుతంగా ఎలా గెలవచ్చో నిరూపించినందుకు చంద్రబాబు టీమ్, పోలీసులు, ఎస్ఈసీకి కంగ్రాట్స్!" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు.నామినేషన్ల దగ్గరి నుంచి మొదలుకొని స్క్రూటినీ, నామినేషన్ల ఉపసంహరణ, పోలింగ్ ఏజెంట్ల నియామకం, పోలింగ్ సరళి, పోలింగ్ శాతం, చివరకు కౌంటింగ్ వరకు ప్రతీ దశను అధికార పక్షం హైజాక్ చేసిందని జగన్ తీవ్ర ఆరోపణలు చేశారు. అభ్యర్థులను ప్రజలు ఎన్నుకోలేదని, అధికార పార్టీయే వారిని సెలెక్ట్ చేసిందని ఎద్దేవా చేశారు.ఈ పరిణామాల నేపథ్యంలో దేశంలో ఎన్నికల సంస్కరణలు ఎంత అవసరమో స్పష్టమవుతోందని జగన్ అభిప్రాయపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా వెలువడుతున్న మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి భారీ విజయం దిశగా దూసుకెళుతుండగా, వైసీపీ అనేకచోట్ల పరాజయం పాలవుతున్న నేపథ్యంలో జగన్ చేసిన ఈ వ్యాఖ్యలు రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

ఈవీఎం అయినా, బ్యాలెట్ అయినా.. విజయం కూటమిదే

- మొదటి పేజి తరువాయి

ఇప్పుడు బ్యాలెట్ ద్వారా చేపట్టిన స్థానిక ఎన్నికలలోనూ ప్రజలు అదే స్థాయి విజయం కూటమికి ఇచ్చారు. ఈవీఎం అయినా, బ్యాలెట్ అయినా ప్రజలు కూటమి పక్షానే ఉన్నారు.మున్సిపల్ ఎన్నికల్లో జనసేన పార్టీకి దక్కిన బలమైన మద్దతు ఎంతో విలువైనది. ఛైర్మన్, మేయర్ అభ్యర్థులకు దక్కిన విజయాలు, ఆధిక్యతలు పరిశీలిస్తుంటే.. పట్టణ, నగర ప్రజలు జనసేనకి ఇస్తున్న ఆదరణ ఎంతో విలువైనది. వారు పార్టీ పట్ల కనబరిచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం. జనసేన, తెదేపా, భాజపాకి అండగా నిలిచిన ఓటర్లకు, జనసేన అభ్యర్థుల విజయం కోసం కృషి చేసిన తెదేపా, భాజపా నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంపూర్ణ సహకారంతో.. ముఖ్యమంత్రి చంద్రబాబు పాలన అనుభవంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్తాం. పురపాలక ఎన్నికల్లో వచ్చిన ఘన విజయాన్ని ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లోనూ సాధిస్తామనే విశ్వాసం ఉంది" అని పవన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ఇది సంబరాలకు కాదు, సేవకు సమయం

- మొదటి పేజి తరువాయి

మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ లో కూటమి ప్రభంజనం సృష్టిస్తున్న నేపథ్యంలో, ప్రజా తీర్పును తమ ప్రభుత్వం ఎంతో వినయంతో స్వీకరిస్తోందని, ఈ గెలుపు పట్ల తాము పొంగిపోవడంలేదని ఆయన పేర్కొన్నారు. పురపాలిక ఎన్నికల ఫలితాల ట్రెండ్ పై ఆయన సోషల్ మీడియా వేదికగా స్పందించారు.గత రెండున్నరేళ్లుగా రాష్ట్రంలో కొనసాగుతున్న సుపరిపాలనకు ప్రజలు ఇచ్చిన ఆశీర్వాదమే ఈ విజయమని లోకేశ్ అభివర్ణించారు. ఈ విజయం కోసం సమష్టిగా కృషి చేసిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులకు, కార్యకర్తలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. కూటమి తరఫున గెలుపొందిన అభ్యర్థులందరికీ హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు."ఎన్నికలు ముగిశాయి. ఇక మా ఏకైక లక్ష్యం సేవ మాత్రమే. పార్టీలకు అతీతంగా ప్రతి పౌరుడికి సేవ చేస్తాం. ఇక్కడ అహంకారానికి ఎలాంటి తావులేదు" అని లోకేశ్ స్పష్టం చేశారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే తమ అసలైన బాధ్యత అని ఆయన ఉద్ఘాటించారు. వారి ఆకాంక్షలను నెరవేర్చేందుకు గతంలో కంటే మరింత కష్టపడి పనిచేస్తామని హామీ ఇచ్చారు. ప్రజా తీర్పు తమపై మరింత బాధ్యతను పెంచిందని, దానిని నిబద్ధతతో నెరవేరుస్తామని లోకేశ్ తన పోస్టులో పేర్కొన్నారు.

ఏపీ మున్సిపల్ ఎన్నికల్లో టీడీపీ కూటమి హవా.. జగన్‌కు షాక్!

ఏపీలో జరిగిన పుర పోరు లో కూటమి అభ్యర్థులు సత్తా చాటారు. జగన్ సొంత నియోజకవర్గం కడప జిల్లా పులివెందులలోనూ తెదేపా జెండా రెపరెపలాడింది. కూటమి మేయర్ అభ్యర్థులు.. తిరుపతిలో మన్నె శ్రీనివాస ప్రసాద్, చిత్తూరులో కఠారి హేమలత, గుంటూరులో కోవెలమూడి లక్ష్మీ అపర్ణ, మచిలీపట్నంలో షేక్ అబ్దుల్లా అబీదా, విశాఖలో ముక్కా శ్రావణి, ఏలూరులో రెడ్డి అప్పలనాయుడు, కర్నూలులో ప్రత్యూష ఘన విజయం సాధించారు. ఇప్పటి వరకు వెలువడిన ఫలితాల్లో నందికొట్కూరు మున్సిపాలిటీలో మాత్రమే వైకాపా గెలుపొందింది. ఆదోనిలో జనసేన రెబల్ స్వప్న విజయం సాధించారు. ప్రస్తుతం ఓట్ల లెక్కింపు కొనసాగుతోంది.

కూటమి అభ్యర్థులు గెలుపొందిన మున్సిపాలిటీలు ఇవే..

తెదేపా: నర్సీపట్నం, పలాస-కాశీబుగ్గ, ఇచ్ఛాపురం, పెద్దాపురం, కొవ్వూరు, మండపేట, ఆకివీడు, పిఠాపురం, నూజివీడు, జగ్గయ్యపేట, జంగారెడ్డిగూడెం, ఉయ్యూరు, నందిగామ, జగ్గయ్యపేట, కొండపల్లి, గురజాల, దాచేపల్లి, పిడుగురాళ్ల, రేపల్లె, కనిగిరి, ఆత్మకూరు(నెల్లూరు), ఎమ్మిగనూరు, ఆళ్లగడ్డ, ఆత్మకూరు(నంద్యాల), కళ్యాణదుర్గం, తాడిపత్రి, గుత్తి, పెనుకొండ, కమలాపురం, రాజంపేట, ప్రొద్దుటూరు, బద్వేల్, మైదుకూరు, మదనపల్లి, పుంగనూరు, రాయచోటి, వెంకటగిరి, సూళ్లూరుపేట, పలమనేరు, కుప్పం, నగరి, పులివెందుల, బొబ్బిలి, మాచర్ల, బుచ్చిరెడ్డిపాలెం, కల్యాణదుర్గం, డోన్, హిందూపురం, రామచంద్రాపురం, వినుకొండ, మార్కాపురం, రాయదుర్గం, గుంతకల్, ధర్మవరం, ఏలేశ్వరం

జనసేన: గొల్లప్రోలు, తుని, సామర్లకోట, పిఠాపురం, ముమ్మిడివరం, అమలాపురం, నిడదవోలు, నర్సాపూర్, పెడన, తిరువూరు, తెనాలి, దర్శి, మడకశిర, పుట్టపర్తి, మడకశిర, పాలకొండ, పుత్తూరు

భాజపా: గూడూరు(కర్నూలు), ఎర్రగుంట్ల, ఎలమంచిలి,గిద్దలూరు

కుప్పంలో టీడీపీ క్లీన్ స్వీప్.. వైసీపీకి సున్నా

ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్‌లో తెలుగుదేశం పార్టీ నేతృత్వంలోని కూటమి విజయాల బాటలో పయనిస్తోంది. ముఖ్యంగా, చిత్తూరు జిల్లా కుప్పం మున్సిపాలిటీలో టీడీపీ అభ్యర్థులు అఖండ విజయం సాధించారు. మున్సిపాలిటీ పరిధిలోని మొత్తం 32 వార్డులను కైవసం చేసుకుని క్లీన్ స్వీప్ చేశారు. ఈ ఎన్నికల్లో వైసీపీకి ఒక్క సీటు కూడా దక్కలేదు. కనీసం ఖాతా కూడా తెరవకపోవడంతో ఆ పార్టీకి కుప్పంలో తీవ్ర నిరాశ ఎదురైంది. కుప్పం ఫలితం టీడీపీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది.కుప్పంలో టీడీపీ సాధించిన ఈ ఘన విజయంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబరాల్లో మునిగిపోయారు. ఫలితాలు వెలువడిన వెంటనే పలుచోట్ల బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచుకుని తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.

కడప జిల్లాలో 4 మున్సిపాలిటీలు టీడీపీ కైవసం.. బీజేపీ ఖాతాలో ఒకటి!

ఆంధ్రప్రదేశ్ పురపాలక ఎన్నికల ఫలితాల్లో వైసీపీకి ఊహించని షాక్ తగిలింది. ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ సొంత జిల్లా అయిన కడపలో తెలుగుదేశం పార్టీ ప్రభంజనం సృష్టించింది. జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలను టీడీపీ కైవసం చేసుకోగా, మరొకటి మిత్రపక్షమైన బీజేపీ దక్కించుకుంది. ఈ ఫలితాలతో వైసీపీ కంచుకోటగా భావించే కడప జిల్లాలో ఆ పార్టీ ఖాతా తెరవలేకపోయింది.

మంగళవారం వెలువడిన మున్సిపల్ ఎన్నికల ఫలితాలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. కడప జిల్లాలోని బద్వేల్, రాజంపేట, రాయచోటి, మైదుకూరు మున్సిపాలిటీల్లో టీడీపీ అభ్యర్థులు ఘన విజయం సాధించారు. మరో కీలకమైన యర్రగుంట్ల మున్సిపాలిటీ (నగర పంచాయమతీ)ని బీజేపీ కైవసం చేసుకుంది. దీంతో జిల్లాలోని మొత్తం ఐదు పురపాలికలు టీడీపీ-బీజేపీ కూటమి ఖాతాలో పడ్డాయి.

దశాబ్దాలుగా వైఎస్ కుటుంబానికి రాజకీయంగా అండగా నిలుస్తున్న కడప జిల్లాలో, ముఖ్యంగా జగన్ సొంత గడ్డపై వైసీపీ ఒక్క మున్సిపాలిటీలో కూడా గెలవలేకపోవడం రాజకీయ వర్గాలను ఆశ్చర్యపరిచింది. ఈ అనూహ్య ఫలితాలు జిల్లాలోని టీడీపీ, బీజేపీ శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపాయి. ఫలితాలు వెలువడిన వెంటనే టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు సంబరాల్లో మునిగిపోయారు. ఇది ప్రజల విజయమని, వైసీపీ పాలనపై తిరస్కారానికి నిదర్శనమని

నవంబర్ 3 మధ్యాహ్నం వెలువడిన ఎన్నికల ట్రెండ్స్ ప్రకారం:

పార్టీ / కూటమి	ఆధిక్యం
టీడీపీ నేతృత్వంలోని ఎన్డీఏ	10 / 13 కార్పొరేషన్లు
ఎన్డీఏ కూటమి	62 మున్సిపాలిటీలు
వైఎస్సార్‌సీపీ	4 మున్సిపాలిటీలు
స్వతంత్రులు	3 మున్సిపాలిటీలు

కూటమి నేతలు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ గెలుపు రాయలసీమ రాజకీయ సమీకరణాలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

కీలక విజయాలు ఎవరివంటే?

- **తిరుపతి: టీడీపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస ప్రసాద్ (జేబీ) మేయర్ ఎన్నికల్లో 30,972 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు.**
- **పులివెందుల: టీడీపీ అభ్యర్థి తుగుట్ల గీతాకుమారి మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నికల్లో 13,875 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.**
- **ఉయ్యూరు: టీడీపీ అభ్యర్థి చెన్నం వెంకటేశ్వరరావు మున్సిపల్ చైర్మన్‌గా విజయం సాధించారు.**
- **కొవ్వూరు: టీడీపీ అభ్యర్థి విజయలక్ష్మి కంఠమనేని 9,668 ఓట్ల మెజారిటీతో చైర్‌పర్సన్‌గా గెలిచారు.**
- **పెద్దాపురం: జనసేన పార్టీ ఒక ప్రారంభ విజయాన్ని నమోదు చేసింది.**

ఏయే ప్రాంతాల్లో ఎన్నికలు జరిగాయి?

- **13 మున్సిపల్ కార్పొరేషన్లు**
- **79 మున్సిపాలిటీలు, నగర పంచాయతీలు**
- **మొత్తం 92 పట్టణ స్థానిక సంస్థలు**

కొన్ని స్థానాల్లో ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. 17 మున్సిపల్ చైర్‌పర్సన్ స్థానాలు కూటమి అభ్యర్థులకు ఏకగ్రీవంగా దక్కాయి. 118 డివిజన్లు, 637 వార్డుల్లోనూ ఏకగ్రీవ ఫలితాలు నమోదయ్యాయి.

మురసు తుపాను ఎఫెక్ట్.. చిలకలూరిపేట హైవేపై వరద నీరు, విజయవాడలో ఎడతెరిపిలేని వాన

మురసు తుపాను ప్రభావంతో పల్నాడు, గుంటూరు జిల్లాల్లో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. మంగళవారం కురిసిన కుండపోత వర్షాలకు అనేక లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. ముఖ్యంగా పల్నాడు జిల్లా చిలకలూరిపేట వద్ద చెన్నై--కోల్‌కతా జాతీయ రహదారిపైకి భారీగా వరద నీరు చేరడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.చిలకలూరిపేట పట్టణంలో పరిస్థితి ఆందోళనకరంగా మారింది. జాతీయ రహదారిని వరద ముంచెత్తడంతో పాటు, పలుచోట్ల విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. అయితే, అధికారులు ముందుజాగ్రత్త చర్యగా విద్యుత్ సరఫరాను నిలిపివేయడంతో ప్రమాదం తప్పిందని స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

మరోవైపు, విజయవాడ నగరాన్ని కూడా వర్షం ముంచెత్తింది. గత 10 గంటలుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానతో నగరంలోని అనేక కాలనీలు, బస్తీలు జలమయమయ్యాయి. ప్రధాన రహదారులపై నీరు నిలిచిపోవడంతో ట్రాఫిక్ స్తంభించింది. గత అనుభవాల నేపథ్యంలో, బుడమేరు వాగుకు మళ్లీ వరద పోటెత్తుతుందేమోనని స్థానిక ప్రజలు తీవ్ర భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికార యంత్రాంగం సహాయక చర్యలపై దృష్టి సారించింది.

ఇది సుపరిపాలనకు దక్కిన విజయం: సీఎం చంద్రబాబు

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో సీఎం చంద్రబాబు స్పందించారు. వెలువడుతున్న ఫలితాల్లో అధికార కూటమి స్పష్టమైన ఆధిక్యం దిశగా పయనిస్తోందని తెలిపారు. సాయంత్రానికి పూర్తిస్థాయి ఫలితాలు వెలువడి, మరింత స్పష్టత రానుందని అన్నారు. ఈ నేపథ్యంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. స్థానిక ఎన్నికల ఫలితాలు తమ ప్రభుత్వ సుపరిపాలనకు ప్రజలు ఇచ్చిన తీర్పు అని ఆయన అభివర్ణించారు."మేం చేస్తున్న సుపరిపాలనను మెచ్చి, మా పనితీరును గమనించే ప్రజలు ఈ తీర్పు ఇచ్చారు. 'గుడ్ పాలిటిక్స్, గుడ్ గవర్నెన్స్' అనేదే నా ప్రాధాన్యత. రాజకీయమా, ప్రజల సమస్యల పరిష్కారమా అంటే.. నేను ఎప్పుడూ సమస్యల పరిష్కారానికే తొలి ప్రాధాన్యం ఇస్తాను" అని చంద్రబాబు స్పష్టం చేశారు. అర్నబ్ తుపాను సమయంలో మూడు రోజుల పాటు రాత్రింబవళ్లు సహాయక చర్యల్లోనే నిమగ్నమైన విషయాన్ని ఆయన గుర్తుచేశారు.ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనుల గురించి వివరిస్తూ.. "అనునిత్యం ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడానికే పనిచేస్తున్నాం. పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తాం. ఇప్పటికే వెలిగొండ ద్వారా నీటిని అందించాం. అమరావతి పనులు పరుగులు పెట్టిస్తున్నాం. గత ప్రభుత్వ హయాంలో ధ్వంసమైన రోడ్లను ఇప్పుడు నిర్మిస్తున్నాం" అని తెలిపారు. అయితే, అన్ని సమస్యలు పరిష్కరించామని చెప్పడం లేదని, వారసత్వంగా వచ్చిన కొన్ని సమస్యలు ఇంకా ఉన్నాయని ఆయన అంగీకరించారు. ప్రజలకు సేవలందించే విషయంలో ఏమైనా పొరపాట్లు ఉంటే వాటిని సరిదిద్దుకుంటామని హామీ ఇచ్చారు. కొందరు విమర్శలు చేస్తున్నా వాటిని పట్టించుకోకుండా ప్రజాసేవకే అంకితమయ్యామని చంద్రబాబు అన్నారు. "లబ్ధి పొందుతూ కూడా ఎగతాళి చేసేవారు ఉంటారు. కులాలు, మతాలు, మాకు ఓటు వేయని వారు అనే భేదాలు మేం చూడటం లేదు. అందరి కోసం పనిచేస్తున్నాం. ప్రజలు మెచ్చే పాలన అందించి, వారి ఇబ్బందులను దూరం చేయడమే మా లక్ష్యం" అని వివరించారు. ప్రజలు ఇదే విధంగా కూటమిని ఆశీర్వదించి, ప్రభుత్వానికి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

భార్యను తెలివి తక్కువది అనడం క్రూరత్వం కాదు..
సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

వరకట్నం కేసులో సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. భర్త తన భార్యను తెలివి తక్కువది, పనికిరానిది అనడం నేరంగా భావించలేమని స్పష్టం చేసింది. ఇలాంటి వ్యాఖ్యలు ఐపీసీ సెక్షన్? 498ఏ కిందకు రావని వ్యాఖ్యానించింది. 2023లో కెనడాలో ఆత్మహత్య చేసుకున్న ఓవివాహిత వరకట్నంలో కేసులో సుప్రీంకోర్టు ఈవ్యాఖ్యలు చేసింది. వివరాల్లోకి వెళితే.

భార్యను తెలివి తక్కువది ,పనికిరానిది అని భర్త అనడం ఐపీసీ సెక్షన్ 498ఏ కింద నేరంగా, క్రూరత్వంగా భావించలేమని, ఇలాంటి వ్యాఖ్యలు భర్త కోప స్వభావాన్ని, ప్రవర్తనా లోపాన్ని సూచించవచ్చని, అయితే వాటిని మాత్రమే ఆధారంగా చేసుకుని క్రిమినల్ కేసు నమోదు చేయలేమని స్పష్టం చేస్తూ కెనడాకు చెందిన ఓ వివాహిత ఆత్మహత్య కేసులో ఆమె భర్తపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది.

కెనడాలో భార్య ఆత్మహత్య.. భర్తపై కేసు

వివరాల్లోకి వెళ్తే.. కెనడాలోని టొరంటోలో నివసిస్తున్న ఓ వివాహిత ఉద్యోగం దొరకకపోవడంతో తీవ్ర మానసిక ఒత్తిడికి గురై ఆత్మహత్య చేసుకుంది. ఆమె రాసిన సూసైడ్ నోట్‌లో చదువు, ఉద్యోగానికి సంబంధించిన సమస్యలను ప్రస్తావించింది. అయితే, ఆమె మరణం తర్వాత తండ్రి భారత్? లో ఆమె భర్తపై కట్న వేధింపులు, క్రూరత్వం వంటి ఆరోపణల ఫిర్యాదుతో కేసు నమోదు అయింది. ఈ కేసులో భర్త తన భార్యను తెలివి తక్కువదని, పనికిరానిదని దూషించేవాడని ఆరోపించారు. దీంతో తనపై నమోదైన కేసును కొట్టివేయాలని భర్త కోర్టును ఆశ్రయించారు. ఈ వ్యవహారం చివరకు సుప్రీంకోర్టుకు చేరింది.

స్పష్టమైన ఆధారాలు ఉండాలి

ఈ పిటిషన్‌పై జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ మన్మోహన్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. భార్యను దూషించినంత మాత్రాన అది నేరపూరిత క్రూరత్వం కిందకు రాదని ధర్మాసనం అభిప్రాయపడింది. కేవలం కోపంతో మాట్లాడిన మాటలను క్రిమినల్ నేరంగా పరిగణించలేమని పేర్కొంది. భర్తపై కట్న వేధింపులు, శారీరక లేదా మానసిక హింసకు సంబంధించిన నిర్దిష్టమైన ఆధారాలు ఉండాలని స్పష్టం చేసింది. సాధారణమైన, అస్పష్టమైన ఆరోపణల ఆధారంగా క్రిమినల్ కేసులను కొనసాగించడం సరికాదని అభిప్రాయపడింది.

భర్తపై ఎఫ్ఐఆర్ కొట్టివేత

కేసులోని పరిస్థితులు, ఆధారాలను పరిశీలించిన సుప్రీంకోర్టు.. భర్తపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను రద్దు చేసింది. భార్య ఆత్మహత్యకు భర్తే కారణమని నిర్ధారించడానికి అవసరమైన ఆధారాలు లేవని పేర్కొంది. ఈ తీర్పు ద్వారా వైవాహిక వివాదాల్లో కేవలం సాధారణ ఆరోపణల ఆధారంగా క్రిమినల్ కేసులు కొనసాగించలేమనే విషయాన్ని మరోసారి స్పష్టం చేసింది.

24 గంటలు గడుస్తోంది..
ఏమైపోయారు మోదీజీ

- మొదటి పేజి తరువాయి

24 గంటలు గడిచాయి మోదీ జీ. నేను మీకు సవాలు విసిరాను. మీరు ప్రతిపక్షం దేశద్రోహి అని అంటున్నారు. ఏ వేదికైనా, ఏ స్థలమైనా ఎంచుకోండి. నాతో డిబేట్ చేయండి. ఎవరు దేశద్రోహి? ఎవరికి విదేశీ శక్తులతో సంబంధాలు ఉన్నాయి? ఆ సంబంధాలు ఎలాంటివి? తేల్చేద్దాం.. అని రాహుల్ గాంధీ ఎక్స్ లో వీడియో పోస్ట్ చేశారు. వీలైనంత త్వరగా డిబేట్ చేద్దాం.. భయపడకండి అని కూడా చెప్పారు.డిబేట్ మీడియా, యువత సమక్షంలో జరగాలని రాహుల్ గాంధీ కోరారు. మోదీ ఎవరినైనా మోడరేటర్‌గా ఎంచుకోవచ్చని, ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్‌ను కూడా నియమించవచ్చని సూచించారు. దేశ ఆర్థిక వ్యవస్థ, ఆర్థిక నిర్మాణం, అమెరికాతో ఒప్పందం ఎలా జరిగింది, ఎందుకు తొందరగా, కేబినెట్‌కు ఎందుకు తెలియజేయలేదు, అదానీ కేసు ఎందుకు మూసివేశారు, ఎప్‌స్టీన్ వంటి అంశాలపై చర్చించాలని అన్నారు. తనపై 45 దాకా దూషణ కేసులు ఉన్నాయని, కానీ విదేశీ సంబంధాలపై చేసిన వ్యాఖ్యలపై ఏ కేసు లేదని చెప్పి, కావాలంటే దావా వేయమని సవాలు విసిరారు. వీడియో చివర దీపావళి శుభాకాంక్షలు కూడా తెలిపారు.

యువతకు పోల్

భారత యువతా, రాహుల్ గాంధీ VS నరేంద్ర మోదీ ఓపెన్ డిబేట్ చూడాలనుకుంటున్నారా? అని అడిగి, ఆప్షన్లు్‌వం -- మోదీ జీ, డరో మత్, No - మోదీ జీ, డర్ గయే.. ఆప్షన్లు ఇచ్చారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, నితిన్ గడ్కరీ, శివరాజ్ సింగ్ చౌహాన్, యోగి ఆదిత్యనాథ్‌లను ట్యాగ్ చేసి మోదీని ఒప్పించమని కోరారు.ఈ సవాలుకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్పందించారు. ఛత్తీస్‌గఢ్ రాజ్యోత్సవం ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని అంశాలపై పార్లమెంటులో చర్చకు సిద్ధమని చెప్పారు. ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్), ఈవీఎంలు, చొరబాటుదారుల అంశాలపై ప్రత్యేక సమావేశం పిలిచి చర్చించడానికి సిద్ధమని షా సవాలు విసిరారు. హైదరాబాద్ నుంచి సవాలు విసురుతున్నాను. ప్రత్యేక సమావేశం పిలుస్తాం. డిబేట్‌కు రండి అన్నారు. బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డిబేట్‌కు సిద్ధమని సవాలు విసిరారు. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు రాహుల్ గాంధీని విమర్శిస్తూ, భారత శత్రువుల అజెండాలను ముందుకు తీసుకెళ్లి ఇతరులపై విదేశీ మద్దతు ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు. అక్టోబర్ 31న రాష్ట్రీయ ఏకతా దివస్ సందర్భంగా మోదీ ప్రతిపక్షాన్ని దేశాన్ని విభజించే శక్తులు, సోషల్ మీడియా ద్వారా దేశ ప్రతిష్టను దెబ్బతీస్తున్నారని ఆరోపించారు. దీనికి స్పందిస్తూ సోమవారం రాహుల్ గాంధీ మోదీ విదేశీ సహాయంతో ప్రధాని అయ్యారని, అలాగే కొనసాగుతున్నారని ఆరోపించి ఓపెన్ డిబేట్ సవాలు విసిరారు.

రాహుల్ గాంధీ నిద్రపోతున్న పోస్టర్లు..
కోల్‌కతా సాల్ట్ లేక్ లో కలకలం!

లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని లక్ష్యంగా చేసుకుని కోల్‌కతాలో వెలసిన పోస్టర్లు రాజకీయంగా కలకలం రేపాయి. నగరంలోని సాల్ట్ లేక్ ప్రాంతంలో మంగళవారం ఉదయం ఈ పోస్టర్లు దర్శనమిచ్చాయి. పార్లమెంట్ సమావేశాలు జరుగుతుండగా రాహుల్ గాంధీ నిద్రపోతున్నట్లుగా ఉన్న చిత్రాలను ముద్రించి, "దేశ్ కీ నేతా ఐసా హో? (దేశ నాయకుడు ఇలాగేనా ఉండేది?)" అనే నినాదాన్ని వాటిపై జోడించారు. అయితే, ఈ పోస్టర్లను ఎవరు అంటించారనే దానిపై స్పష్టత లేదు. ఇప్పటివరకు ఏ వ్యక్తి గానీ, సంస్థ గానీ దీనికి బాధ్యత వహించలేదు. ఈ పోస్టర్లలో రాహుల్ గాంధీకి సంబంధించిన రెండు వేర్వేరు చిత్రాలు ఉన్నాయి. ఒక చిత్రంలో, ఆయన పార్లమెంట్‌లో చెంపలకు చేతులు ఆనించుకుని కళ్లు మూసుకుని ఉండగా, మరో చిత్రంలో సీటులో వెనక్కి వాలి కూర్చుని ఉన్నారు. ఈ చిత్రాల ద్వారా, రాహుల్ సభా కార్యక్రమాల సమయంలో నిద్రపోతున్నారని చెప్పే ప్రయత్నం జరిగింది.దేశంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణకు (ఎస్ఐఆర్) వ్యతిరేకంగా, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ రాహుల్ గాంధీ ఢిల్లీలో విపక్షాలను ఏకతాటిపైకి తెచ్చి ఉద్యమం చేస్తున్న తరుణంలో ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం.మరోవైపు, బీజేపీ దేశవ్యాప్తంగా 'ప్రజాస్వామ్యాన్ని కాపాడండి, అరాచకత్వాన్ని తొలగించండి' పేరుతో కౌంటర్ ప్రచారాన్ని ప్రారంభించింది. ఇందులో భాగంగా సోమవారం కోల్‌కతాలో బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబిన్ నేతృత్వంలో భారీ ర్యాలీ నిర్వహించారు. పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ పాలన నుంచి విముక్తి లభించినట్లే, ఢిల్లీకి కూడా రాహుల్ గాంధీ నుంచి త్వరగా విముక్తి కలగాలని ఆయన వ్యాఖ్యానించారు.మంగళవారం సిలిగురిలో జరిగిన ర్యాలీలో పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి మాట్లాడుతూ.. ఓటర్ల జాబితా నుంచి అక్రమ చొరబాటుదారులను తొలగించేందుకు ఎన్నికల సంఘం ప్రయత్నిస్తుంటే, వారిని కాపాడేందుకు మమతా బెనర్జీ, రాహుల్ గాంధీ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.

బుడమేరు పరిస్థితి పూర్తిగా నియంత్రణలో ఉంది.. కలెక్టర్ డా. జి. లక్ష్మీశ

విజయవాడ, పెన్ పవర్, నవంబర్, 03,

బుడమేరువిషయంలో ప్రజలు భయాందోళనలకు గురికావద్దు.. పరిస్థితి పూర్తిగా నియంత్రణలో ఉంది: కలెక్టర్ డా. జి. లక్ష్మీశ

క్షేత్రస్థాయిలోఅధికారులు అందుబాటులో ఉంటూ నిరంతరం పరిస్థితులను పర్యవేక్షిస్తున్నారు.

కొండ ప్రాంతాలు మినహా ఇతర ప్రాంతాల ప్రజలను తరలించాల్సిన అవసరం లేదు.. పుకార్లను నమ్మవద్దు.

అపోహలు, ధృవీకరించని వార్తలను నమ్మవద్దు.. వాటిని ప్రచారం చేయవద్దు.జిల్లా యంత్రాంగం విడుదల చేసే అధికారిక సమాచారాన్ని మాత్రమే అనుసరించండి.కాన్పు తేదీ దగ్గరపడిన గర్భిణులను ముందస్తు జాగ్రత్తగా పునరావాస కేంద్రాలకు తరలించాలి: సెక్టార్ అధికారులకు కలెక్టర్ ఆదేశం.సెక్టార్ అధికారులు ప్రతి వీధిని క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ అప్రమత్తంగా ఉండాలి. పునరావాస కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, ఆహార సదుపాయాలను పక్కాగా సిద్ధం చేయాలి: ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.



లక్ష్మీశ.

పెన్ పవర్
సెంట్రల్ అంధ్ర
ఏన్.టి.ఆర్ జిల్లా । కృష్టా । గుంటూరు । పల్నాడు । బాపట్ల

తుఫాను ముప్పు ప్రాంతాల్లో ఎమ్మెల్యే మాలకొండయ్య, ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ పర్యటనప్రజల భద్రతకు ప్రాధాన్యత

ప్రజల భద్రతకు ప్రాధాన్యత.. ప్రత్యేక బస్సుల ద్వారా పునరావాస కేంద్రాలకు తరలింపు



చీరాల నవంబర్ 3 (పెన్ పవర్) :

తుఫాను ముప్పు పొంచి ఉన్న ప్రాంతాల్లో చీరాల శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్య, ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, జిల్లా ఎస్పీ పర్యటించి పరిస్థితులను సమీక్షించారు.తుఫానుప్రభావంతోప్రమాదం ఎదురయ్యే అవకాశం ఉన్న ప్రాంతాల ప్రజలను ముందస్తుగా సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య స్వయంగా ప్రజల వద్దకు వెళ్లి బాధితులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఎలాంటి ఆందోళన చెందవద్దని, ప్రజలరక్షణకుప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని ధైర్యం చెప్పారు. అధికారుల సమన్వయంతో ప్రజలను ప్రత్యేక బస్సుల్లో పునరావాస కేంద్రాలకు సురక్షితంగా తరలించే ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కౌంటింగ్ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన సాధారణ పరిశీలకురాలు నాగలక్ష్మి.ఎస్,

విజయవాడ, పెన్ పవర్,నవంబర్ 3:

ఎన్టీఆర్జిల్లాలోస్థానికసంస్థల ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను అత్యంతపకడ్బందీగా,నిష్పక్షపాతంగా,పారదర్శకంగానిర్వహించాలని జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల సాధారణ పరిశీలకురాలు నాగలక్ష్మి.ఎస్,ఐఏఎస్అధికారులనుఆదేశించారు.మంగళవారం జగ్గయ్యపేట మున్సిపాలిటీకి సంబంధించి ఎస్.జి.ఎస్ కళాశాలలో, విజయవాడ నగరపాలక సంస్థకు సంబంధించి ఆంధ్ర లయోలా కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాలను ఆమె ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఓట్ల లెక్కింపు ప్రక్రియతో పాటు భద్రతా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా అన్ని ఏర్పాట్లు ఉండాలని, ప్రతి రౌండ్ ఓట్ల లెక్కింపులో ఎన్నికల నిబంధనలను కచ్చితంగా పాటించాలని కౌంటింగ్ సిబ్బందికి సూచించారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద అవాంఛనీయ





సంఘటనలు జరగకుండా పటిష్టమైన పోలీస్ బందోబస్తు, మూడంచెల భద్రతను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

కౌంటింగ్ హాళ్లలో సీసీటీవీ నిఘా, నిరంతర విద్యుత్ సరఫరా, కంప్యూటర్ల పనితీరు, ఏజెంట్ల సీటింగ్ ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు ఉండకూడదని స్పష్టం చేశారు. రిటర్నింగ్ అధికారులు, కౌంటింగ్ సూపర్వైజర్లు సమన్వయంతో పనిచేస్తూ ఫలితాలను ఖచ్చితత్వంతో నమోదు చేయాలని సూచించారు.

ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించి, ఎలాంటి గందరగోళానికి తావులేకుండా కౌంటింగ్ ప్రక్రియను సజావుగా పూర్తి చేయాలని సాధారణ పరిశీలకురాలు నాగలక్ష్మి.ఎస్ ఆదేశించారు ఈ తనిఖీల్లో సంబంధిత మున్సిపల్ అధికారులు, రిటర్నింగ్ అధికారులు, రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

తుఫాన్ వేళ మానవతా సేవ.. 2,000 మంది ప్రయాణికులకు ఆహార పంపిణీ

గుంటూరు,పెన్ పవర్,నవంబర్ 3:

మురసు తుఫాన్ ప్రభావంతో రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడి గుంటూరు రైల్వే స్టేషన్లో చిక్కుకున్న సుమారు 2,000 మంది ప్రయాణికులకు ఆర్ఎస్ఎస్ స్వయంసేవకులు, ఆరోగ్య భారతి, సక్షం, సేవా భారతి కార్యకర్తలు ఆహారాన్ని పంపిణీ చేశారు.

బాపట్ల, ఒంగోలు వైపు వెళ్లాల్సిన పలు రైళ్లను గుంటూరు మీదుగా మళ్లించడంతో ప్రయాణికులు గంటల తరబడి ఆహారం లేక ఇబ్బందులు పడ్డారు. పరిస్థితిని గుర్తించిన సేవా సంస్థల కార్యకర్తలు తక్షణమే స్పందించి పెరుగన్నం, పులిహోర ప్యాకెట్లను పంపిణీ చేశారు.హంరేడియో కార్యకర్తలు ప్రయాణికుల పరిస్థితిపై సమాచారాన్ని సేకరించి సహాయక చర్యలకు సమన్వయం అందించారు. ఆంధ్రప్రదేశ్ హంరేడియో ఫెస్ట్ సంయోజకులు డాక్టర్ కాకాని పృథ్వీరాజు ఇంటి నుంచే సమన్వయం చేశారు.

సుమారు 55 మంది స్వయంసేవకులు మధ్యాహ్నం 12



గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ఆర్ఎస్ఎస్ జిల్లా కార్యదర్శి మాధవరెడ్డి, డాక్టర్ శ్రీనివాసరెడ్డి, ఇప్పర్ల రామారావు, శేషారావు, సుబ్రహ్మణ్యం తదితరులు నాయకత్వం వహించారు.

ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడమే నిజమైన సేవ అని ఈ మానవతా కార్యక్రమం చాటిచెప్పింది.

సేవే పరమో ధర్మః! జై హింద్! జై భారత్!లి

మురసు తుపాను ప్రభావం.. చీరాల మున్సిపల్ ఓట్ల లెక్కింపు వాయిదా

ఈ నెల 6వ తేదీకి కౌంటింగ్ వాయిదా.. అభ్యర్థుల్లో కొనసాగుతున్న ఉత్కంఠ

చీరాల, నవంబర్ 3, (పెన్ పవర్) :

మురసు తుపాను ప్రభావంతో చీరాల మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ వాయిదా పడింది. ప్రతికూలవాతావరణపరిస్థితులను దృష్టిలో ఉంచుకుని చీరాల మున్సిపాలిటీ పరిధిలో చైర్మన్, కౌన్సిలర్ అభ్యర్థుల ఓట్ల లెక్కింపును ఈ నెల 6వ తేదీకి వాయిదావేస్తూఅధికారులునిర్ణయంతీసుకున్నారు.వాతావరణ పరిస్థితులు అనుకూలించిన అనంతరం నిర్ణీత తేదీన ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. దీంతో తమ గెలుపోటములపై ఆశలు పెట్టుకున్న అభ్యర్థులు, రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తల్లో ఉత్కంఠ నెలకొంది. ఎన్నికల ఫలితాల కోసం ఎదురుచూస్తున్న



వారికి మరో మూడు రోజులు నిరీక్షణ తప్పని పరిస్థితి ఏర్పడింది.

మురసు తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు -- నవంబర్ 4న ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా విద్యాసంస్థలకు సెలవు కలెక్టర్ జి. లక్ష్మీశ

విజయవాడ: పెన్ పవర్,నవంబర్ 3,



మురసు తుఫాన్ తీరం దాటిన అనంతరం ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా అధిక వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకొని నవంబర్ 4వ తేదీ బుధవారం జిల్లావ్యాప్తంగా అన్ని విద్యాసంస్థలకు సెలవు ప్రకటించినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ తెలిపారు.ఈ మేరకు జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలు, అంగన్వాడీ కేంద్రాలకు సెలవు వర్తిస్తుందని స్పష్టం చేశారు. సంబంధిత యాజమాన్యాలు, అధికారులు ఈ ఆదేశాలను తప్పనిసరిగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

భారీ వర్షాల నేపథ్యంలో విద్యార్థులు, చిన్నారుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, తల్లిదండ్రులు తమ పిల్లలను అత్యవసరమైతే తప్ప ఇంటి నుంచి బయటకు పంపవద్దని సూచించారు. వర్షపు నీరు నిలిచిన ప్రాంతాలు, కాలువలు, చెరువులు, నీటి ప్రవాహాలు ఉన్న ప్రాంతాల వద్దకు పిల్లలు వెళ్లకుండా తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని జిల్లా యంత్రాంగం జారీ చేసే సూచనలు, ఆదేశాలను ప్రజలు ఎప్పటికప్పుడు గమనించాలని, అధికారులకు సహకరిస్తూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

ఎన్టీఆర్ జిల్లాలో విపత్తు నిర్వహణకు పటిష్ట ముందస్తు ఏర్పాట్లు కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ

విజయవాడ , పెన్ పవర్,నవంబర్ 03:

ఎన్టీఆర్ జిల్లాలో విపత్తు నిర్వహణ చర్యలను పటిష్టంగా అమలు చేయాలని, అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు రక్షణ, సహాయక చర్యలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు సిద్ధంగా ఉంచాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ అధికారులను ఆదేశించారు.

విపత్తు నిర్వహణ నిబంధనల మేరకు ఏ.కొండూరు మండలం కంభంపాడులోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన విపత్తు నిర్వహణ పరికరాలు, అత్యవసర సహాయక సామగ్రిని కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అత్యవసర సమయాల్లో సహాయక చర్యలు ఆలస్యం కాకుండా ప్రొక్లెయిన్లు, ట్రాక్టర్లు, తాళ్లు, పవర్ సా యంత్రాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడితే వెంటనే పునరుద్ధరించేందుకు ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు.

మండలంలో ఎక్కడైనా విపత్తు సంభవించినప్పుడు ఒకే కేంద్రం నుంచి యంత్రాలు, పరికరాలను తక్షణమే తరలించి సహాయక, పునరుద్ధరణ చర్యలు వేగవంతంగా చేపట్టేలా అధికారులు ఏర్పాట్లు చేసినట్లు వివరించారు.

రహదారిపై కూలిన భారీ వృక్షం.. కలెక్టర్ చొరవతో ట్రాఫిక్ పునరుద్ధరణ

మరోవైపు, తిరువూరు మున్సిపాలిటీ కౌంటింగ్ కేంద్రంలో ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియను పరిశీలించి తిరిగి వస్తున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.



లక్ష్మీశ మార్గమధ్యంలో ప్రజలకు ఎదురైన సమస్యపై తక్షణమే స్పందించారు. ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లి గ్రామంలోని సత్యనారాయణపురం సమీపంలో సి.ఎ. కన్వెన్షన్ ఎదురుగా జాతీయ రహదారిపై భారీ వృక్షం కూలిపోవడంతో ఇరువైపులా వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. పరిస్థితిని గమనించిన కలెక్టర్ వెంటనే సంబంధిత అధికారులను, సిబ్బందిని అప్రమత్తం చేసి చెట్టును తొలగించాలని ఆదేశించారు.

కలెక్టర్ స్వయంగా ఘటనా స్థలంలో ఉండి తొలగింపు పనులను పర్యవేక్షించడంతో సిబ్బంది సమన్వయంతో చెట్టు కొమ్మలను తొలగించి రహదారిపై రాకపోకలను పునరుద్ధరించారు. దీంతో వాహనదారులకు



ఏర్పడిన ఇబ్బందులు తొలగిపోయాయి.ప్రజలకు ఎదురయ్యే సమస్యలపై అధికారులు తక్షణమే స్పందించి క్షేత్రస్థాయిలో పరిష్కార చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. విపత్తులు, అత్యవసర పరిస్థితుల్లో సమయస్ఫూర్తితో వ్యవహరిస్తూ ప్రజల భద్రతకు, రవాణా సౌకర్యాల పునరుద్ధరణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.భారీ వృక్షాన్ని వెంటనే తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించడంలో కలెక్టర్ చూపిన చొరవపై వాహనదారులు, స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ.కొండూరు తహసిల్దార్ వై. నాగమణి, విద్యుత్ శాఖ ఏఈతో పాటు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రపంచ కరాటే ఛాంపియన్‌షిప్‌లో ఎంజీఎం విద్యార్థిని ప్రియదర్శినికి స్వర్ణం, కాంస్యం



శ్రీకాళహస్తి,పెన్ పవర్, నవంబర్ 03:

బెంగళూరులోని కోరమంగళ ఇండోర్ స్టేడియంలో అక్టోబర్ 30 నుంచి నవంబర్ 1 వరకు నిర్వహించిన వరల్డ్ కరాటే ఛాంపియన్‌షిప్--2026లో శ్రీకాళహస్తి ఎంజీఎం స్కూల్ రెండో తరగతి విద్యార్థిని కె. ప్రియదర్శిని అద్భుత ప్రతిభ కనబరిచింది. అండర్--7 విభాగంలో కటా పోటీల్లో మొదటి బహుమతిగా స్వర్ణ పతకం, కుమిటే విభాగంలో మూడో బహుమతిగా కాంస్య పతకాన్ని సాధించి పాఠశాలకు, శ్రీకాళహస్తికి గర్వకారణంగా నిలిచింది. ఈ అంతర్జాతీయ పోటీల్లో కజకిస్థాన్, రష్యా తదితర దేశాల క్రీడాకారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎంజీఎం ఇన్‌స్టిట్యూషన్స్ డైరెక్టర్ శ్రీమతి గుడ్లూరు ఐశ్వర్య మాట్లాడుతూ.. తమ విద్యాసంస్థ చదువులతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన ప్రియదర్శినిని అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి క్రీడారంగంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఎంజీఎం ఇన్‌స్టిట్యూషన్స్ డైరెక్టర్ గుడ్లూరు ఐశ్వర్య, హెడ్మాస్టర్ మునిరత్నం నాయుడు, విద్యార్థిని తల్లిదండ్రులు పాల్గొని ప్రియదర్శినిని అభినందించారు.

43వ డివిజన్‌లో బీజేపీ అభ్యర్థి రంగావజ్జుల గాయత్రి ఘన విజయం

గుంటూరు, పెన్ పవర్, నవంబర్, 03,



గుంటూరు నగరంలోని 43వ డివిజన్‌లో తెలుగుదేశం, జనసేన పార్టీల మద్దతుతో భారతీయ జనతా పార్టీ తరఫున పోటీ చేసిన అభ్యర్థి రంగావజ్జుల గాయత్రి ఘన విజయం సాధించారు.మొత్తం 1078 ఓట్ల మెజారిటీతో ప్రత్యర్థులపై విజయం సాధించి డివిజన్‌లో విజయభేరి మోగించారు. ఎన్నికల ఫలితాలు వెలువడినఅనంతరం రిటర్నింగ్ అధికారి వద్ద నుంచి రంగావజ్జుల గాయత్రి గెలుపు ధ్రువీకరణ పత్రాన్ని అందుకున్నారు.ఈ సందర్భంగా 43వ డివిజన్‌లో కూటమి శ్రేణుల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. ప్రజలు తనపై ఉంచిన నమ్మకానికి ఈ విజయం నిదర్శనమని, డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తానని రంగావజ్జుల గాయత్రి పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ, డివిజన్‌ను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని తెలిపారు.ఈ ఘన విజయం సాధించిన రంగావజ్జుల గాయత్రికి కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అభినందనలు తెలియజేశారు.

విజయవాడ ఈస్ట్‌లో వంగవీటి రాధాకృష్ణకు ఓట్ల వరద..సుంకర రమేష్

విజయవాడ, పెన్ పవర్, నవంబర్, 03,

విజయవాడ నగర మేయర్ అభ్యర్థి వంగవీటి రాధాకృష్ణకు విజయవాడ ఈస్ట్ పరిధిలో భారీగా ఓట్లు పోలైనట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈస్ట్ నియోజకవర్గంలో ప్రతి ఐదు ఓట్లలో నాలుగు ఓట్లు ఆయనకు అనుకూలంగా నమోదైనట్లు తెలుస్తోంది. ప్రజల్లో రాధాకృష్ణకు ఉన్న ఆదరణ, విశ్వాసం ఈ ఓట్ల సరళిలో స్పష్టంగా కనిపిస్తున్నాయని రాజకీయవర్గాలుఅభిప్రాయపడుతున్నాయి.విజయవాడ నగర అభివృద్ధి, ప్రజా సంక్షేమం పట్ల రాధాకృష్ణకు ఉన్న నిబద్ధతకు ప్రజలు తమ ఓట్లరూపంలో మద్దతు తెలిపినట్లు తెలుస్తోంది. ఈస్ట్ ప్రాంతంలో ఆయనకు లభించిన భారీ ఆదరణరాజకీయంగాప్రాధాన్యతసంతరించుకుంది.ఈ సందర్భంగా వంగవీటి రాధాకృష్ణకు సుంకర రమేష్ హృదయపూర్వక అభినందనలు



తెలియజేశారు.ప్రజలవిశ్వాసాన్ని చూరగొంటూ భారీ మద్దతు సాధించడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రజల ఆశీస్సులతో విజయవాడ నగర అభివృద్ధికి రాధాకృష్ణ మరింత కృషి చేయాలని ఆకాంక్షించారు.విజయవాడ ఈస్ట్‌లో రాధాకృష్ణకు లభించిన ఈ ప్రజా మద్దతు శుభపరిణామమని, భవిష్యత్తులో ప్రజా సేవలో మరిన్ని విజయాలు సాధించాలని సుంకర రమేష్ అభినందనలు తెలిపారు.

చిటత్తూరు ఎంపీటీసీ సెగ్మెంట్‌లో జనసేనకు బ్రహ్మరథం

స్థానిక అభ్యర్థి యానాది మణికి ప్రజల మద్దతు.. దండి నరేంద్ర

శ్రీకాళహస్తి రూరల్, పెన్ పవర్, నవంబర్ 03:

తొట్టంబేడు మండలం చిటత్తూరు ఎంపీటీసీ సెగ్మెంట్‌లో జనసేన పార్టీ ఎన్నికల ప్రచారం జోరుగా సాగింది. చిటత్తూరు, కారకొల్లు, దొంగలముడూరు,శివనాథపాలెంగ్రామాల్లో జనసేన నాయకులు, జనసైనికులు,వీరమహిళలతో కలిసి నియోజకవర్గ సమన్వయకర్త దండి నరేంద్ర ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

ఈ సందర్భంగా జనసేన బలపరిచిన స్థానిక ఎంపీటీసీ అభ్యర్థి యానాది మణికి గాజు గ్లాసు గుర్తుపై, టీడీపీ బలపరిచిన జడ్పీటీసీ అభ్యర్థి రావెళ్ల మునిరాజా నాయుడుకు సైకిల్ గుర్తుపై ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. స్థానికుడైన యానాది మణి అభ్యర్థిత్వాన్ని ప్రజలు మనస్ఫూర్తిగా స్వాగతిస్తూ మద్దతు తెలుపుతున్నారని దండి నరేంద్ర పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారాన్ని విజయవంతం చేసిన జనసేన నాయకులు, జనసైనికులు, వీర మహిళలు, చిటత్తూరు ఎంపీటీసీ సెగ్మెంట్



ప్రజలకు ఆయన హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. సమిష్టి కృషితో జనసేన ఎంపీటీసీ, టీడీపీ జడ్పీటీసీ అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించాలని దండి నరేంద్ర పిలుపునిచ్చారు.

తొట్టంబేడులో మునిరాజా నాయుడు ప్రచార జోరు

ఆరు గ్రామాల్లో విస్తృత ప్రచారం.. సైకిల్ గుర్తుకు ఓటేయాలని అభ్యర్థన



తొట్టంబేడు, పెన్ పవర్ ,నవంబర్ 03:

తొట్టంబేడు మండలంలో టీడీపీ–ఎన్డీఏ కూటమి బలపరిచిన జడ్పీటీసీ అభ్యర్థి రావెళ్ల మునిరాజా నాయుడు సోమవారం తొట్టంబేడు, కత్తివారికండ్రిగ, బసవన్నగుంట, ఎస్టీ సెంటర్, ముడూరు, కారాకొల్లు గ్రామాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, పీలేరు నియోజకవర్గ పరిశీలకులు మాసారపు సుబ్బయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ప్రజలను కలుసుకుని కూటమి అభ్యర్థి మునిరాజా నాయుడును సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని నాయకులు, కార్యకర్తలు కోరారు. ప్రచారంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జి. దశరథ ఆచారి, మాజీ రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతి నాయుడు, ఎంపీటీసీ అభ్యర్థి తాటిపర్తి రవీంద్రారెడ్డి, రాష్ట్ర మైనారిటీ విభాగ కార్యనిర్వాహక కార్యదర్శి షాకీర్ ఆలీ, శ్రీకాళహస్తి మార్కెట్ కమిటీ సభ్యుడు షేక్ షఫీ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.ఖ

విశాఖలో భారత్--అమెరికా 'టైగర్ ట్రయంఫ్--2026' ప్రారంభం

విపత్తు సహాయక చర్యల్లో సమన్వయమే లక్ష్యం.. తొలిసారిగా ఎన్‌డీఆర్‌ఎఫ్ భాగస్వామ్యం

న్యూఢిల్లీ, పెన్ పవర్ ,నవంబర్ 03:

భారత్--అమెరికా త్రివిధ దళాల సంయుక్త మానవతా సహాయం, విపత్తు సహాయక విన్యాసం 'టైగర్ ట్రయంఫ్--2026' ఐదో ఎడిషన్ సోమవారం విశాఖపట్నంలోని మారిటైమ్ వార్‌ఫేర్ సెంటర్‌లో ప్రారంభమైంది. భారీ విపత్తుల సమయంలో ఇరు దేశాల సాయుధ దళాల మధ్య సమన్వయం, సంయుక్త ప్రణాళిక, కలిసి పనిచేసే సామర్థ్యాన్ని మెరుగుపరచడం దీని ప్రధాన లక్ష్యం.ఈ ఏడాది విన్యాసాన్ని 'టేబుల్‌టాప్ ఎక్సర్‌సైజ్' రూపంలో నిర్వహిస్తున్నారు. ఊహాత్మక విపత్తు పరిస్థితుల ఆధారంగా సహాయక చర్యల ప్రణాళిక, బాధ్యతల సమన్వయంపై ఇందులో కసరత్తు చేస్తారు. ప్రారంభ కార్యక్రమానికి భారత తూర్పు నౌకాదళ ఫ్లీట్ కమాండర్ రియర్ అడ్మిరల్ విశాల్ బిష్ణోయ్, అమెరికా పసిఫిక్ ఫ్లీట్ వైస్ కమాండర్ రియర్ అడ్మిరల్ జోక్విన్ జె. మార్టినెజ్ డి పినిల్లోస్ అధ్యక్షత వహించారు.

భారత్ తరఫున నౌకాదళంలోని వివిధ సముద్ర కార్యకలాపాల నిపుణులు, సైన్యానికి చెందిన భూతల బలగాలు, వైమానిక దళంలోని పలు విభాగాల ప్రతినిధులు, త్రివిధ దళాల ప్రత్యేక బలగాల సిబ్బంది పాల్గొంటున్నారు. జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (ఎన్‌డీఆర్‌ఎఫ్) బృందం తొలిసారిగా ఈ విన్యాసంలో




భాగస్వామ్యం కానుంది.

అమెరికా తరఫున ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్, మెరైన్ కోర్ ప్రతినిధులతోపాటు అంతరిక్ష, సైబర్, వైద్య, పేలుడు పదార్థాల నిర్వీర్య విభాగాల నిపుణులు పాల్గొంటున్నారు.

భారీ విపత్తుల సమయంలో వివిధ రంగాలకు చెందిన దళాలు సమష్టిగా స్పందించేందుకు అవసరమైన ప్రణాళికలు, కార్యాచరణ విధానాలపై ఈ విన్యాసం దృష్టి సారిస్తోంది. భారత్--అమెరికా మధ్య విస్తరిస్తున్న రక్షణ భాగస్వామ్యానికి, సముద్ర వ్యూహాత్మక ప్రయోజనాల్లో పెరుగుతున్న సహకారానికి ఇది ప్రతిబింబంగా నిలుస్తోంది.

సోమాలియా తీరంలో సముద్ర దొంగల చెర నుంచి 'అజిని' విముక్తి

భారత నౌకాదళం ఆపరేషన్ విజయవంతం.. 20 మంది సిబ్బంది సురక్షితం



న్యూఢిల్లీ, పెన్ పవర్ ,నవంబర్ 03:

సోమాలియా తీరంలో సాయుధ సముద్ర దొంగలు హైజాక్ చేసిన 'అజిని' చేపల వేట నౌకను భారత నౌకాదళం విజయవంతంగా విడిపించింది. 48 గంటలకు పైగా సాగిన సమన్వయ ఆపరేషన్‌లో నౌకలోని 20 మంది సిబ్బందిని సురక్షితంగా రక్షించింది. ఈ చర్యలో ఎవరికీ గాయాలు, ప్రాణనష్టం సంభవించలేదు.గత నెల ప్రారంభంలో సోమాలియా ఈశాన్య తీరానికి సమీపంలో అజిని నౌక హైజాక్‌కు గురైనట్లు సమాచారం అందింది. ఈ నౌకను స్థావరంగా ఉపయోగించుకుని సముద్ర దొంగలు వాణిజ్య నౌకలపై మరిన్ని దాడులకు పాల్పడే ప్రమాదం ఉండటంతో భారత నౌకాదళం రంగంలోకి దిగింది.

సముద్ర నిఘా విమానం సహకారంతో విధుల్లో ఉన్న యుద్ధనౌకను సహాయక చర్యలకు పంపించింది. నిరంతర నిఘాతో అజిని ఆచూకీని గుర్తించి, దాని కదలికలను పర్యవేక్షించింది. కాల్పులకు తావులేని నియంత్రిత చర్యలతో నౌక తప్పించుకోకుండా అడ్డుకుంది.

ఆపరేషన్‌కు అదనపు బలంగా భారత వైమానిక దళానికి చెందిన సీ--17 విమానం ద్వారా మెరైన్ కమాండోలను నిర్దేశిత ప్రాంతంలో ఖచ్చితత్వంతో ఎయిర్‌డ్రాప్ చేశారు. అనంతరం సమన్వయంతో చేపట్టిన వ్యూహాత్మక చర్యలో సముద్ర దొంగల ముప్పును అధిగమించి, నౌకను సురక్షితంగా తమ ఆధీనంలోకి తీసుకున్నారు. మొత్తం 20 మంది సిబ్బందిని విడిపించారు.

సంక్లిష్ట సముద్ర భద్రతా కార్యకలాపాలను నిర్వహించడంలో భారత నౌకాదళ సన్నద్ధతకు, దళాల మధ్య సమన్వయానికి ఈ విజయం నిదర్శనంగా నిలిచింది. నావికుల రక్షణ, కీలక సముద్ర వాణిజ్య మార్గాల భద్రత, హిందూ మహాసముద్ర ప్రాంతంలో సుస్థిరమైన భద్రతా వాతావరణం కోసం కట్టుబడి ఉన్నట్లు భారత నౌకాదళం పేర్కొంది.నుంది.

అమెరికా తరఫున ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్, మెరైన్ కోర్ ప్రతినిధులతోపాటు అంతరిక్ష, సైబర్, వైద్య, పేలుడు పదార్థాల నిర్వీర్య విభాగాల నిపుణులు పాల్గొంటున్నారు.

భారీ విపత్తుల సమయంలో వివిధ రంగాలకు చెందిన దళాలు సమష్టిగా స్పందించేందుకు అవసరమైన ప్రణాళికలు, కార్యాచరణ విధానాలపై ఈ విన్యాసం దృష్టి సారిస్తోంది. భారత్--అమెరికా మధ్య విస్తరిస్తున్న రక్షణ భాగస్వామ్యానికి, సముద్ర వ్యూహాత్మక ప్రయోజనాల్లో పెరుగుతున్న సహకారానికి ఇది ప్రతిబింబంగా నిలుస్తోంది.

తుఫాన్లను సమర్థంగా ఎదుర్కొన్నాం.. 4-5 రోజుల్లోనే విద్యుత్ వ్యవస్థ పునరుద్ధరణ: సీఎం చంద్రబాబు

అమరావతి పెన్ పవర్, నవంబర్ 03:

వరుస తుఫాన్లతో ఆంధ్రప్రదేశ్‌లో తీవ్ర నష్టం సంభవించినప్పటికీ, ప్రాణనష్టాన్ని నివారించడంతో పాటు ఆస్తినష్టాన్ని సాధ్యమైనంత వరకు తగ్గించడంలో ప్రభుత్వ యంత్రాంగం సమర్థంగా పనిచేసిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. అర్నబ్, మురసు తుఫాన్ల సమయంలో ప్రభుత్వం చేపట్టిన సహాయక చర్యలు, అధికార యంత్రాంగం పనితీరును ఆయన వివరించారు. అమరావతిలోని ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి నిర్వహించిన మీడియా సమావేశంలో సీఎం మాట్లాడుతూ.. తుఫాన్లను ఎదుర్కోవడంలో ముందస్తు అంచనాలు, పక్కా ప్రణాళిక, సమన్వయం కీలక పాత్ర పోషించాయని పేర్కొన్నారు.

రెస్క్యూ, రిలీఫ్, రిహాబిలిటేషన్ (రక్షణ, సహాయక చర్యలు, పునరావాసం) అనే మూడు ప్రధాన అంశాలపై దృష్టి సారించి పనిచేశామని చంద్రబాబు వెల్లడించారు. రెండు తుఫాన్ల గమనాన్ని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, గాలుల వేగం, వర్షపాతం, వరద ముప్పును విశ్లేషించి సహాయక చర్యలకు ప్రణాళికలు రూపొందించామని చెప్పారు. క్షేత్రస్థాయి నుంచి ఉన్నతాధికారుల వరకు మొత్తం ప్రభుత్వ యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి సమన్వయంతో పనిచేశామన్నారు.

ఆర్టీజీఎస్ ద్వారా క్షేత్రస్థాయిలోని అధికారులకు ఎప్పటికప్పుడు కచ్చితమైన సమాచారాన్ని అందించగలిగామని సీఎం తెలిపారు. అవేర్ వ్యవస్థ ద్వారా అందుబాటులో ఉన్న డేటాను విశ్లేషించి నిర్ణయాలు తీసుకున్నామని చెప్పారు. గాలుల వేగం, వర్షపాతం అంచనాలు, వరద నిర్వహణ, నీటి



నిర్వహణ వంటి అంశాలను ముందుగానే అంచనా వేసి కార్యాచరణ రూపొందించామన్నారు. క్షేత్రస్థాయి పరిస్థితులతో పోల్చి చూసినప్పుడు తమ అంచనాలు దాదాపు 90 శాతం మేర వాస్తవమయ్యాయని వెల్లడించారు. తుఫాన్ల ప్రభావానికి గురయ్యే గ్రామాలు, ముంపు ప్రాంతాలను ముందుగానే గుర్తించి, అక్కడికి అవసరమైన సహాయక సిబ్బంది, పరికరాలను తరలించామని చంద్రబాబు వివరించారు. ముందస్తు అంచనాల ఆధారంగా తీసుకున్న చర్యల వల్ల ప్రభావిత ప్రాంతాల్లో త్వరగా సాధారణ పరిస్థితులను పునరుద్ధరించగలిగామని చెప్పారు.

విద్యుత్ వ్యవస్థకు తీవ్ర నష్టం

తుఫాన్ల కారణంగా రాష్ట్రంలో విద్యుత్ వ్యవస్థ తీవ్రంగా దెబ్బతిందని ముఖ్యమంత్రి తెలిపారు. సుమారు 31 వేల విద్యుత్ స్తంభాలు నేలకూలాయని, 4,095 గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిందని వెల్లడించారు. అలాగే 548 సబ్‌స్టేషన్లలో విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని వివరించారు.

విద్యుత్ వ్యవస్థకు ఇంత భారీ నష్టం జరిగిన నేపథ్యంలో సాధారణ పరిస్థితులు తీసుకురావడానికి కనీసం 20 రోజులు పడుతుందని అంచనా వేసినప్పటికీ, పక్కా ప్రణాళికతో కేవలం నాలుగైదు రోజుల్లోనే విద్యుత్ సరఫరాను చాలావరకు పునరుద్ధరించగలిగామని సీఎం చెప్పారు. విద్యుత్ శాఖ ఉన్నతాధికారుల నుంచి క్షేత్రస్థాయి సిబ్బంది వరకు అందరూ నిరంతరం పనిచేశారని ప్రశంసించారు.

భారీ వర్షాలు కురుస్తున్న సమయంలోనూ విద్యుత్ పునరుద్ధరణ పనులను కొనసాగించామని తెలిపారు. అడ్డుగా ఉన్న చెట్లను తొలగిస్తూ, దెబ్బతిన్న స్తంభాల స్థానంలో కొత్త స్తంభాలను ఏర్పాటు చేశామన్నారు. పెద్ద ఎత్తున డ్రిల్లింగ్ యంత్రాలను అందుబాటులోకి తీసుకొచ్చి పనులను వేగవంతం చేశామని చెప్పారు. ఆక్వా చెరువుల్లోనూ విద్యుత్ స్తంభాలు కూలిపోవడంతో పునరుద్ధరణ పనులు మరింత సవాలుగా మారాయని వివరించారు.

విద్యుత్ సిబ్బంది సేవలు అభినందనీయం

తుఫాన్ సహాయక చర్యల్లో విద్యుత్ శాఖ సిబ్బంది చేసిన సేవలను చంద్రబాబు ప్రత్యేకంగా అభినందించారు. ప్రతికూల వాతావరణంలో, వర్షాన్ని సైతం లెక్కచేయకుండా తమ ప్రాణాలను పణంగా పెట్టి విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు సిబ్బంది కృషి చేశారని కొనియాడారు. ప్రభుత్వ యంత్రాంగం సమన్వయంతో పనిచేయడం, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడం, ముందస్తు ప్రణాళికలు అమలు చేయడం వల్లే తుఫాన్ల ప్రభావం నుంచి రాష్ట్రాన్ని త్వరగా కోలుకునేలా చేయగలిగామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

ఎస్ఐఆర్‌లో ఓటర్ల తొలగింపుపై తీవ్ర అభ్యంతరాలు.. ప్రక్రియను పూర్తిగా రద్దు చేయాలని వోటర్ రైట్స్ ఫోరం డిమాండ్



హైదరాబాద్,పెన్ పవర్, నవంబర్ 03::

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (SIR) ప్రక్రియలో భారీగా అక్రమ తొలగింపులు జరిగాయని తెలంగాణవోటర్ రైట్స్ ఫోరం (ఎఒ=ళీ) ఆరోపించింది. ఈ ప్రక్రియలో ఎదురైన లోపాలు, బాధిత ఓటర్ల అనుభవాలనుమంగళవారంహైదరాబాద్‌లోనిర్వహించి నమీడియా సమావేశంలో వెల్లడించింది. ముషీరాబాద్, సికింద్రాబాద్‌కంటోన్మెంట్‌నియోజకవర్గాల్లోనిర్వహించిన సామాజిక ఆడిట్, ప్రజా విచారణల ఆధారంగా పలు కీలక అంశాలను బయటపెట్టింది.

ఫోరం ప్రతినిధి డాక్టర్ ఎ. సునీత వివరాల ప్రకారం, సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లోని 150, 151 బూత్‌ల పరిధిలో 757 మంది ఓటర్లను ప్రత్యక్షంగా సర్వే చేయగా, 232 మంది పేర్లు తొలగింపు జాబితాలో ఉన్నాయని, వారిలో 43 మంది ఓట్లు అన్యాయంగా తొలగించబడ్డాయని గుర్తించారు. మరో 383 మందికి నోటీసులు అందాయి. ముషీరాబాద్‌లో సర్వే చేసిన 95 మంది తొలగించబడిన ఓటర్లలో 42 మంది ఓట్లు అన్యాయంగా తొలగించినట్లు వెల్లడించారు.

ఈ సమావేశంలో బాధిత ఓటర్లు తమ ఆవేదనను వ్యక్తంచేశారు.ఏళగాఓటుహక్కువినియోగించుకుంటున్నప్పటికీ, తమ పేర్లను 'అందుబాటులో లేరు' అనే కారణంతో తొలగించారని వాపోయారు. ప్రజా విచారణలో పాల్గొన్న ప్రొఫెసర్ జి. హరగోపాల్, డాక్టర్ పరాకాల ప్రభాకర్, ప్రొఫెసర్ పద్మజా షా, మరియా తబస్సుమ్, సిస్టర్ మంజుల, ఎర్రాయవాది ఎస్.క్యూ. మసూద్ తదితరులు ఎస్ఐఆర్ ప్రక్రియలోని లోపాలను ఎత్తిచూపారు.

కేంద్ర హోంమంత్రి అమిత్ షా హైదరాబాద్‌లో చేసిన వ్యాఖ్యలను డాక్టర్ పరాకాల ప్రభాకర్ తీవ్రంగా ఖండించారు. తొలగించిన ఓటర్ల వాస్తవ పరిస్థితులను తెలుసుకోవాలంటే వోటర్ రైట్స్ ఫోరం నిర్వహించిన ప్రజా విచారణలను సందర్శించాలని సూచించారు. ఎలాంటి ఆధారాలు లేకుండా అక్రమ వలసదారుల పేరుతో ఓటర్ల తొలగింపును సమర్థించడం సరికాదని విమర్శించారు. ప్రస్తుత ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఐఆర్‌లో మహిళలు, మైనారిటీలు, దళితులు, ఆదివాసీలు, కార్మిక వర్గాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని వక్తలు ఆందోళన వ్యక్తం చేశారు. ఓటు హక్కును కాపాడేందుకు ఎన్నికల సంఘం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు.

ప్రస్తుత ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తిగా వెనక్కి తీసుకోవాలని, 2025 మార్గదర్శకాలను రద్దు చేయాలని, ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలని, 2023 ఎన్నికల కమిషన్ చట్టాన్ని రద్దు చేయాలని ఫోరం డిమాండ్ చేసింది. హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికలకు ప్రస్తుత లోపభూయిష్ట ఓటర్ల జాబితాలను ఉపయోగించకుండా, 2025 ఓటర్ల జాబితా ఆధారంగా ప్రజా ఆడిట్ నిర్వహించి కొత్త జాబితాలను రూపొందించాలని కోరింది.

సాంకేతికంగా శక్తిమంతమైన సైన్యం నిర్మాణమే లక్ష్యం: రాజ్‌నాథ్ సింగ్

2029 నాటికి రూ.3 లక్షల కోట్ల రక్షణ ఉత్పత్తులు.. రూ.50 వేల కోట్ల ఎగుమతుల లక్ష్యం

న్యూఢిల్లీ,పెన్ పవర్, నవంబర్ 03::

ప్రస్తుత, భవిష్యత్తు భద్రతా సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనేలా భారత సాయుధ దళాలను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. రాజస్థాన్‌లోని జైసల్మేర్‌లో మంగళవారం 'భారత రక్షణ దళాల ఆధునికీకరణ' అంశంపై నిర్వహించిన రక్షణ మంత్రిత్వ శాఖ సంప్రదింపుల కమిటీ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు.మారుతున్న యుద్ధ విధానాలు, కొత్త భద్రతా సవాళ్లు, అధునాతన ఆయుధ వ్యవస్థల సమీకరణ, త్రివిధ దళాల సమన్వయం, స్వదేశీ రక్షణ తయారీపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. కృత్రిమ మేధ, స్వయంచాలక వ్యవస్థలు, మానవరహిత వేదికలు, సైబర్, అంతరిక్ష, ఎలక్ట్రానిక్ యుద్ధ సాంకేతికతలనుసైనికసామర్థ్యాలతోఅనుసంధానించాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు.2026--27 ఆర్థిక సంవత్సరంలో రక్షణ బడ్జెట్‌ను రికార్డు స్థాయిలో రూ.7.85 లక్షల కోట్లకు పెంచినట్లు రాజ్‌నాథ్ తెలిపారు. ఇందులో ఆధునికీకరణ, మూలధన కొనుగోళ్ల కోసం రూ.2.19 లక్షల కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. నిధుల సమర్థ వినియోగంతోపాటు దళాల అత్యవసర అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వడం కీలకమన్నారు.

రక్షణ రంగంలో స్వావలంబన గణనీయంగా



పెరిగిందని మంత్రి పేర్కొన్నారు. 2014--15లో రూ.46,429 కోట్లుగా ఉన్న రక్షణ ఉత్పత్తుల విలువ 2025--26లో రూ.1.78 లక్షల కోట్లకు చేరిందన్నారు. 2014లో రూ.2 వేల కోట్లలోపే ఉన్న రక్షణ ఎగుమతులు ప్రస్తుతం సుమారు రూ.40 వేల కోట్లకు పెరిగాయని వివరించారు. 2029 నాటికి రూ.3 లక్షల కోట్ల రక్షణ ఉత్పత్తులు, రూ.50 వేల కోట్ల ఎగుమతులను సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు.అధునాతన ఆయుధాలు, క్షిపణులు, రక్షణ వ్యవస్థల అభివృద్ధిలో డీఆర్‌డీఓ కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థల నుంచి భారీ పరిశ్రమల వరకు ప్రైవేటు రంగానికి అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. రక్షణ దళాలు, పరిశోధన సంస్థలు, ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రైవేటు పరిశ్రమలు, విద్యాసంస్థల మధ్య సహకారం మరింత పెరగాలని సూచించారు.

సైనిక బలం సాంకేతికత, ఆర్థిక వనరులతోపాటు సిబ్బంది నైపుణ్యం, సన్నద్ధతపై ఆధారపడి ఉంటుందని రాజ్‌నాథ్ అన్నారు. మారుతున్న యుద్ధ అవసరాలకు అనుగుణంగా త్రివిధ దళాలు తమ నిర్మాణాలను మెరుగుపరుచుకుంటున్నాయని చెప్పారు. భారత సైన్యంలో ఏర్పాటు చేసిన 'అశని', 'ఖైరవ్', 'శక్తిబాణ్' ప్లాటూన్లు సమకాలీన కార్యాచరణ అవసరాలను సమర్థంగా ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు.

ఆధునికీకరణ అంటే కొత్త ఆయుధాలు కొనుగోలు చేయడమే కాదని, దీర్ఘకాలిక స్వదేశీ సామర్థ్యాలను అభివృద్ధి చేసుకోవడం కూడా అని స్పష్టం చేశారు. విదేశీ వనరులపై వ్యూహాత్మక ఆధారపడటాన్ని తగ్గిస్తూ పరిశోధన, ఆవిష్కరణలు, దేశీయ పరిశ్రమల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించాలన్నారు.

సమావేశంలో లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు పలు సూచనలు చేశారు. కీలక సామర్థ్యాలకు ప్రాధాన్యం ఇవ్వడం, కొనుగోలు--అభివృద్ధి ప్రక్రియలను వేగవంతం చేయడం, నిర్దేశిత లక్ష్యాల పురోగతిని సమీక్షించడంపై దృష్టి సారించారు. రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్, రక్షణ కార్యదర్శి రాజేశ్ కుమార్ సింగ్‌తోపాటు ఉన్నత పౌర, సైనిక అధికారులు పాల్గొన్నారు.

ఆర్.ఓ. నుంచి డిక్లరేషన్ పత్రం స్వీకరిస్తున్న ఆళ్ళ శిరీష..



గుంటూరు, పెన్ పవర్, నవంబర్, 03

గుంటూరు: నగరంలోని 30వ డివిజన్ జనసేన పార్టీ అభ్యర్థి ఆళ్ళ శిరీష ఎన్నికల ప్రక్రియలో భాగంగా రిటర్నింగ్ అధికారి (ఆర్.ఓ.) నుంచి డిక్లరేషన్ పత్రాన్ని స్వీకరించారు. ఎన్నికల నిబంధనల ప్రకారం అధికారుల సమక్షంలో డిక్లరేషన్ పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన అధికారిక కార్యక్రమాలు నిర్వహించారు. 30వ డివిజన్‌లో జనసేన పార్టీ అభ్యర్థిగా ఆళ్ళ శిరీష ఎన్నికల బరిలో నిలిచారు.

గిత్యాల కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశాలతో అధికారులు చొరవతో తల్లిదండ్రుల చెంతకు చేరిన చిన్నారి




పెన్ పవర్ ,నవంబర్ 03:

జగిత్యాల జిల్లాలో చిన్నారి వ్యవహారంలో ఎట్టకేలకు కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశాలతో అధికారులు చర్యలు చేపట్టారు. చిన్నారిని తల్లిదండ్రులకు అప్పగించాలంటూ వచ్చిన మీడియా కథనాల నేపథ్యంలో సోమవారం రాత్రి అధికారులు చిన్నారిని పెంచుకుంటున్న తల్లిదండ్రులకు అప్పగించారు. దీంతో కొంతకాలంగా శిశు సంక్షేమ కేంద్రంలో ఉన్న చిన్నారి తిరిగి తల్లిదండ్రుల చెంతకు చేరింది. చిన్నారిని తమకు అప్పగించాలని తల్లిదండ్రులు చేసిన విజ్ఞప్తికి, హైకోర్టు ఉత్తర్వులకు అనుగుణంగా అధికారులు ఈ ప్రక్రియ పూర్తి చేసినట్లు సమాచారం. చిన్నారి తల్లిదండ్రుల వద్దకు చేరడంతో కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

నల్లమలలో రహదారికి మోక్షం ఎప్పుడు? -- ఏకైక ఇష్టకామేశ్వరి అమ్మవారి ఆలయానికి మెరుగైన రవాణా సౌకర్యం కల్పించాలని భక్తుల డిమాండ్!

పెన్ పవర్ ,నవంబర్ 03:



శ్రీశైలం:భారతదేశం మొత్తం మీద మరెక్కడా లేని విధంగా, కేవలం శ్రీశైలం నల్లమల అటవీ ప్రాంతంలో మాత్రమే వెలసిన మహిమాన్విత పుణ్యక్షేత్రం ఇష్టకామేశ్వరి అమ్మవారి ఆలయం. భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లిగా విరాజిల్లుతున్న ఈ తల్లి దర్శనానికి వెళ్లాలంటే భక్తులు పడుతున్న పాట్లు అన్నీ ఇన్నీ కావు. దట్టమైన అడవి మధ్యలో ఉన్న ఈ గుహాలయానికి వెళ్లడానికి ఇప్పటికీ సరైన రోడ్డు మార్గం లేదు.

అటవీ శాఖ నిబంధనల ప్రకారం సాధారణ వాహనాలకు అనుమతి లేకపోవడంతో, భక్తులు కేవలం ప్రత్యేక జీపుల ద్వారా మాత్రమే రాళ్లు, గుంతలతో కూడిన ప్రమాదకరమైన, సాహసోపేతమైన జీపు ప్రయాణం చేయాల్సి వస్తోంది. వృద్ధులు, మహిళలు, పిల్లలు ఈ కఠినమైన ప్రయాణం కారణంగా అమ్మవారిని దర్శించుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ప్రభుత్వాలు, పర్యావరణ శాఖల ముందున్న ప్రధాన సవాళ్లు:పర్యావరణ పరిరక్షణ: నల్లమల అడవి టైగర్ రిజర్వ్ మరియు వన్యప్రాణులకు నిలయం కావడంతో, శాశ్వత రోడ్లు వేస్తే జీవరాశుల సంచారానికి, పర్యావరణ సమతుల్యతకు భంగం కలుగుతుందనే ఆందోళన ఉంది.

కేంద్ర ప్రభుత్వ అనుమతులు: అటవీ మరియు పర్యావరణ మంత్రిత్వ శాఖల నుండి ప్రత్యేక అనుమతులు సాధించడం ఈ మార్గం అభివృద్ధిలో కీలకం.

పర్యావరణహిత ప్రత్యామ్నాయాలు: అడవిలోని మూగజీవాలకు, చెట్లకు ఎలాంటి హాని కలగకుండా పర్యావరణహిత రవాణా మార్గాలను ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.

భక్తుల ప్రధాన డిమాండ్లు:

సురక్షిత రవాణా: పర్యావరణానికి ఎటువంటి హాని కలగకుండా, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ప్రత్యేక అనుమతులు మంజూరు చేసి ఒక పద్ధతి ప్రకారం రోడ్డు మార్గాన్ని అభివృద్ధి చేయాలి.నియంత్రిత ప్రయాణం: రోజూ నిర్దిష్ట సంఖ్యలో మాత్రమే భక్తులను అనుమతించేలా, ప్రత్యేక బస్సులు లేదా ఇతర వాహనాలను ప్రవేశపెట్టాలి.సౌకర్యాల కల్పన: దేశం నలుమూలల నుండి ఏకైక ఆలయంగా విరాజిల్లుతున్న ఇష్టకామేశ్వరి క్షేత్రాన్ని పర్యాటకంగానూ, భక్తిపరంగానూ అభివృద్ధి చేసి భక్తుల ప్రయాణ ఇబ్బందులను తొలగించాలి.మూగజీవాలకు ఇబ్బంది కలగకుండా, పర్యావరణాన్ని సంరక్షిస్తూనే ఈ దివ్యక్షేత్రానికి ఒక చక్కటి రవాణా మార్గాన్ని ఏర్పాటు చేయాలని భక్తులు, ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

జగిత్యాల జిల్లాలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్ (సివిల్స్) పరీక్షకు పకడ్బంది ఏర్పాట్లు పూర్తి – జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్



పెన్ పవర్ ,నవంబర్ 03:

జగిత్యాలలో టిజిపిఎస్సి ఆధ్వర్యంలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్ (సివిల్స్) పరీక్షను నవంబర్ 6, 7 తేదీల్లో జేఎన్‌టీయూహెచ్ లో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ తెలిపారు.

ఈ పరీక్ష కంప్యూటర్ ఆధారిత విధానంలో (సీబీటీ) ఉదయం 10:00 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు మధ్యాహ్నం 2:30 గంటల నుండి 5:00 గంటల వరకు రెండు షిఫ్టులలో నిర్వహించబడుతుందని పేర్కొన్నారు.

జగిత్యాల జిల్లాలోని జేఎన్‌టీయూహెచ్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, నాచుపల్లి, కొండగట్టు, కొడిమ్యాల మండలంలో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్ష ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. పరీక్ష కేంద్రం వద్ద పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడంతోపాటు, సైబర్ పోలీసుల ద్వారా సామాజిక మాధ్యమాల్లో తప్పుడు లేదా తప్పుదోవ పట్టించే సమాచార వ్యాప్తిని పర్యవేక్షించాలని సూచించారు. పరీక్ష సమయంలో నిరంతర విద్యుత్ సరఫరాతోపాటు అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రత్యామ్నాయ విద్యుత్ ఏర్పాట్లను సిద్ధంగా ఉంచాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. పరీక్ష కేంద్రంలో ప్రథమ చికిత్స, అత్యవసర వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంచాలని వైద్యారోగ్య శాఖకు సూచించారు.పరీక్ష కేంద్రం పరిసరాల్లో పారిశుధ్య నిర్వహణ చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పరీక్ష సమయంలో అంతరాయం లేని ఇంటర్నెట్ సదుపాయం కల్పించడంతోపాటు సీసీ కెమెరాలు నిరంతరం పనిచేసేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

మద్దతు ధర ఇవ్వకుండా కార్పొరేట్లకు దోచిపెడుతున్న ప్రభుత్వం: అన్నదాతల కన్నీరు - సామాన్యుడి బతుకు భారమైన వైనం!

పెన్ పవర్ ,నవంబర్ 03:



దేశానికి వెన్నెముక అయిన రైతు కష్టాలు ఒకవైపు అంతులేకుండా పోతుంటే, మరోవైపు నిత్యావసర వస్తువులు, బియ్యం, ఎరువుల ధరలు సామాన్యుడి నడ్డి విరుస్తున్నాయి. ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా, కార్పొరేట్ శక్తులకు పెద్దపీట వేయడమే తప్ప, కష్టపడి పంట పండించే అసలు సిసలైన అన్నదాతకు మాత్రం సరైన గిట్టుబాటు ధర దక్కడం లేదనే ఆవేదన తీవ్రరూపం దాల్చుతోంది.

?మార్కెట్‌లో ప్రస్తుతం వడ్లు (ధాన్యం) క్వింటాకు రూ. 4,500 నుంచి రూ. 5,000 వరకు అమ్ముడవుతున్న పరిస్థితి కనిపిస్తోంది. గడిచిన కాలంలో బస్తా రూ. 3,000, రూ. 3,500, రూ. 4,000 పలికిన సందర్భాలున్నాయి. అయితే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎకరానికి ఇస్తున్న సాయంపై రైతుల నుంచి తీవ్ర చర్చ జరుగుతోంది. కేంద్ర ప్రభుత్వం సాయం తగ్గిస్తోందా? లేక రాష్ట్ర ప్రభుత్వం కోత పెడుతోందా? రైతు భరోసా కింద ఇస్తే, పది ఎకరాల పొలం ఉన్నవారికి మందులు, ఎరువుల భారం ఎలా తగ్గుతుంది? ఈ రసాయనిక ఎరువులు వేసి పండించిన పంటలు ప్రజలు తినగలుగుతున్నారా? లేదా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు పండిస్తున్నాయా? జనమే కదా ఇవన్నీ తిని రోగాలపాలై అల్లాడిపోవాలి?

రైతు శ్రమకు దక్కని గుర్తింపు – కార్పొరేట్ల దోపిడీ:ఎక్కడో ఏసీ గదుల్లో కూర్చొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటనలు ఇస్తుంటాయి కానీ... పంట పండించే రైతుకు తన శ్రమ, తన కష్టం విలువ ఏమిటో కచ్చితంగా తెలుసు. కార్పొరేట్ శక్తులకు దేశాన్ని దోచిపెట్టడమే ధ్యేయంగా మందుల రేట్లు, ఎరువుల ధరలు పెంచుకుంటూ పోతున్నారు. ఇవాళ సామాన్య మానవుడు కనీసం కొనగలుగుతున్నాడా? 25 కిలోల బియ్యం సంచి ఏకంగా రూ. 2,500 ఉంటే నిరుపేదలు ఎలా బతకాలి?

?ఇప్పటికైనా రేట్లు తగ్గించే మార్గం ప్రభుత్వాలు ఎందుకు ఆలోచించడం లేదు? కార్పొరేట్ వర్గాలకు దోచిపెట్టడం తప్పితే సామాన్య మానవుడి, నిరుపేదల సంగతి పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఏ ప్రభుత్వం వచ్చినా రైతుకి ఏనాడైనా నిజమైన మద్దతు ధర దక్కిందా? దేశవ్యాప్తంగా ఇంత విచ్చలవిడిగా రేట్లు పెరిగిపోయాయి. గతంలో క్వింటా వడ్లు రూ. 2,000 నుంచి రూ. 2,500 కి వచ్చేసరికి రైతులు అప్పులపాలై చచ్చిపోయే పరిస్థితి ఉండేది. కానీ ఇప్పుడు ఒకేసారి క్వింటా రూ. 4,500 నుంచి రూ. 5,000 అంటే సామాన్యుడికి ఇది ఎలా సాధ్యం?

?ఇప్పటికైనా ప్రభుత్వాలు మేల్కొని, కార్పొరేట్ దోపిడీకి అడ్డుకట్ట వేసి, రైతుకు నిజమైన మద్దతు ధరను అందించాలి... సామాన్యుడికి అందుబాటు ధరల్లో బియ్యం, నిత్యావసరాలు లభించేలా తక్షణ చర్యలు తీసుకోవాలని ఈ ప్రత్యేక కథనం ద్వారా డిమాండ్ చేయబడుతోంది.

అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల సమస్యల పరిష్కారానికి మహాధర్నా -- జగిత్యాల కలెక్టరేట్ ముట్టడి..

పెన్ పవర్ ,నవంబర్ 03:



అంగన్వాడీటీచర్లు,హెల్పర్లసమస్యలనుపరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర అంగన్వాడీ టీచర్స్ ఉ హెల్పర్స్ అసోసియేషన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో సోమవారం జగిత్యాల జిల్లా కలెక్టరేట్ ఎదుట మహా ధర్నా నిర్వహించి, కలెక్టరేట్‌ను ముట్టడించారు అనంతరం జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ సిబ్బంది తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు.ఈసందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు మేకల సాయిశ్వరి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఏశమేని గణేష్, అంగన్వాడీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంగరి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లకు నెలకు రూ.18 వేల వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, పీఎఫ్, హెల్త్ కార్డులు, రూ.25 లక్షల బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. అలాగే నెలకు రూ.10 వేల పెన్షన్ అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.అంగన్వాడీ సిబ్బందికి అదనంగా కేటాయిస్తున్న బీఎల్ఓ విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని, ఐసీడీఎస్‌లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని నాయకులు కోరారు. పెండింగ్ బిల్లులు, టీఏ, డీఏ బకాయిలను వెంటనే చెల్లించాలని, పదవీ విరమణ చేసిన సిబ్బందికి రావాల్సిన ప్రయోజనాలను తక్షణమే అందించాలని డిమాండ్ చేశారు. అర్హత, సీనియారిటీ ఆధారంగా గ్రేడ్-2 సూపర్‌వైజర్ పోస్టులకు పదోన్నతులు కల్పించాలని పేర్కొన్నారు. అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు ఎన్నో ఏళ్లుగా ప్రజలకు సేవలందిస్తున్నప్పటికీ వారి సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకపోవడం విచారకరమని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో తమ న్యాయమైన డిమాండ్లు నెరవేరే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు దయావతి, లక్ష్మీ, లావణ్య, శారద, వనిత, హిమగిరి, షామీం సుల్తానా, సుమలత, సునీత, లక్ష్మీ, పద్మ, మంజుల తదితరులు పాల్గొన్నారు. ఏఐటీయూసీ గౌరవ అధ్యక్షుడు సుతారి రాములు, అందే వంశీ, జిల్లా మున్సిపల్ ప్రధాన కార్యదర్శి ఎం.డి. ఉస్మాన్, భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు రామిల్ల రాంబాబు, ఎం.డి. సమీర్, కిరణ్ కుమార్, బీజనపల్లి మనోహర్ తదితరులు ధర్నాకు మద్దతుగా పాల్గొన్నారు.

రైస్ మిల్లువ్యాపరులు దొడ్డు బియ్యాన్ని సన్న బియ్యంగా మార్చి పేదలకు పంచే సన్న బియ్యం పేరుతో అమాయక ప్రజలను లేనిపోని రోగాల పాలు చేస్తున్నారు...

-అఖిల భారత ఓసీ సంఘంజాతీయ అధ్యక్షుడు పెంజర్ల మహేందర్ రెడ్డి

పెన్ పవర్ ,నవంబర్ 03:



తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి, రాష్ట్ర గవర్నర్, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిలకు రైస్ మిల్ వ్యాపారుల అక్రమాలపై కఠిన చర్యలు తీసుకొని, వారి ఆస్తులను జప్తు చేసి, రైతులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేసినఅఖిల భారత ఓసీ సంఘంజాతీయ అధ్యక్షుడు పెంజర్ల మహేందర్ రెడ్డిరాష్ట్రంలోపెరుగుతున్నబియ్యంధరలనునియంత్రించాలని, రైస్ మిల్ వ్యాపారుల అక్రమాలపై కఠిన చర్యలు తీసుకోవాలని మహేందర్ రెడ్డి కోరారు గత కొన్ని సంవత్సరాలుగా కొందరు రైస్ మిల్ యజమానులు ప్రభుత్వాన్ని, రైతులను తీవ్రంగా మోసం చేస్తున్నారుప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎఫ్సీఐ ద్వారా రైస్ మిల్లులకు అప్పగిస్తే, సకాలంలో సన్న బియ్యం ఇవ్వకుండా, దొడ్డు బియ్యాన్ని సన్న బియ్యంగా మార్చి అప్పగిస్తున్నారు. పేదలకు పంచే సన్న బియ్యం పేరుతో అమాయక ప్రజలను లేనిపోని రోగాల పాలు చేస్తున్నారు.

ప్రభుత్వాన్ని కాదని, రైతుల దగ్గరకు నేరుగా వెళ్లి అదనంగా ధాన్యాన్ని కొనుగోలు చేసి, రైతులను మోసం చేస్తున్నారు. బ్లాక్ మార్కెట్ కు తరలిస్తున్నారు స్టాక్ చూపించకుండా ఉన్న స్టాకులన్నీ అమ్ముకుంటూ, గత 13 సంవత్సరాలుగా విపరీతమైన ఆస్తులు పెంచుకున్నారు. ఒక్కొక్కరు 5 నుండి 10 రైస్ మిల్లులు పెట్టి, కొన్ని వేల కోట్ల రూపాయలు సంపాదించి, ప్రభుత్వాలను శాసించే స్థాయికి వచ్చారు. బియ్యం ధరలు విపరీతంగా పెరగడం వెనుక వీరి మాఫియానే ఉంది వీరు దాచిన ఆస్తులు భూములపైన,సినిమాలపైన, విదేశాలలో రియల్ ఎస్టేట్ పైన, బిజినెస్ ల పైన సిండికేట్ అయి బినామీల పేర్లతో, వారి అత్తగారి, బావమరుదుల, దూరపు బంధువుల పేర్ల మీద జమ చేయడం జరిగింది. దీనిని రాబట్టడానికి కఠినమైన స్పెషల్ ఆఫీసర్లను, స్పెషల్ చట్టాలను తీసుకువచ్చి నియమించాలి.గతంలో తెరాస పాలనలో వీరు చేసిన ఆగడాలు అంతా ఇంతా కాదు. రైతులను మోసం చేయడం, డబ్బులతో ఐపీలు పెట్టడం, రైతులకు డబ్బులు ఎగ్గొట్టడం జరిగింది. సిద్దిపేట, కరీంనగర్, కామారెడ్డి, నిజామాబాద్, మెదక్ ప్రాంతాల్లో వేలాది మంది రైతుల దగ్గర ధాన్యాన్ని కొనుగోలు చేసి వారిని ముంచి, హైదరాబాద్ లాంటి నగరాల్లో స్థిరాస్తులు ఏర్పాటు చేసుకొని, రైతులకు డబ్బులు ఎగ్గొట్టి, కోర్టుల ద్వారా ఐపీ పెట్టి, రైతులకే నోటీసులు ఇచ్చి కేసుల పాలు చేస్తున్నారు. ప్రతి కోర్టులో వీరు పెట్టిన ఐపీ ల లిస్టు వందలలో ఉంటుంది. రైతులను భయభ్రాంతులకు గురిచేశారు.

అసోసియేషన్ ల పేరుతో ప్రభుత్వాలను బ్లాక్ మెయిల్ చేస్తున్నారు, బెదిరిస్తున్నారు.

వారి ఆస్తులను, వారి బినామీ ఆస్తులను, రాష్ట్ర, విదేశాలలో దాచిన డబ్బులను తిరిగి రాబట్టాలి.

పేదలకు పంచే బియ్యంలో మోసం చేసిన ఈ దొంగలను అరెస్టు చేసి జైల్లో పెట్టి, వారి వద్ద నుండి రికవరీ చేయాలి.

ఇంతకుముందు నక్సలైట్లకు ఉపయోగించిన గ్రేహౌండ్స్ బలగాలను సి ఆర్పి ఎఫ్, ఏపీఎస్పీ బలగాలను మోహరించి కఠిన చర్యలు తీసుకోవాలి.

వారి ఆస్తులను జప్తు చేసి తిరిగి రైతులకు ఇవ్వాలి

"హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి విజ్ఞప్తి"

ఇలాంటి వ్యాపారస్తులకు బెయిల్ ఇవ్వద్దని మనవి. వీరు బయటకు వస్తే సాక్ష్యాలను తారుమారు చేస్తారు

ఈ లేఖ ద్వారా ప్రభుత్వం పూర్తిగా చర్యలు తీసుకుంటుందని, రైతులకు న్యాయం జరుగుతుందని పెంజర్ల మహేందర్ రెడ్డి అశిస్తూన్నారు

మెట్ పల్లి మండలం జగ్గసాగర్ ఆత్మకూర్ గ్రామాల్లోని పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

పెన్ పవర్ ,నవంబర్ 03:





ఈ సందర్భంగా పాఠశాలల్లో విద్యార్థులకు అందుతున్న విద్యాబోధన, మౌలిక సదుపాయాలు, పాఠశాలనిర్వహణతదితరఅంశాలనుపరిశీలించారు .అనంతరంపదవ తరగతి విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడి వారి చదువుల పురోగతిని, పరీక్షలకు చేస్తున్న సన్నద్ధతను అడిగి తెలుసుకున్నారు..పదవ తరగతివిద్యార్థులు ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా చదువుతూ మంచి మార్కులు సాధించాలని, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని కష్టపడి చదవాలని సూచించారు..విద్యార్థులకుఉపాధ్యాయులునాణ్యమైన విద్యాబోధన అందిస్తూ, పదవ తరగతి ఫలితాల్లో మంచిఉత్తీర్ణతసాధించేలాప్రత్యేకశ్రద్ధతీసుకోవాలనిసూచించారు...విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది పడేలా అందరూ సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల పేర్కొన్నారు.

పల్నాడు చారిత్రక నిధి 'గుత్తికొండ బిలం' -- రహస్య సొరంగ మార్గాలు, బ్రహ్మనాయుడి తపస్సు విశేషాలు!

పెన్ పవర్ ,నవంబర్ 03:

పల్నాడు జిల్లా:చారిత్రక క్రీడాస్థలిగా, వీరచరిత్రకు పుట్టినిల్లైన పల్నాడు గడ్డపై ఎన్నో అద్భుతాలు, రహస్యాలు దాగి ఉన్నాయి. మాచర్ల నుంచి పల్నాడు ప్రాంతం మీదుగా వెళ్లే మార్గంలో ఉన్న ప్రసిద్ధ గుత్తికొండ బిలం (గుహ) ఇటు ఆధ్యాత్మిక ప్రియులను, అటు సాహస యాత్రికులను ఎంతగానో ఆకర్షిస్తోంది. పల్నాడు చరిత్రలో బ్రహ్మనాయుడి కాలం నాటి ఆనవాళ్లు, అమరావతి వరకు విస్తరించి ఉన్నాయనే రహస్య సొరంగ మార్గాల గురించిన ఆసక్తికర విషయాలు స్థానికంగా ఎంతో ప్రాచుర్యంలో ఉన్నాయి.

అసలు ఎక్కడ ఉంది? ఎంత పాడవు ఉంటుంది

ప్రాంతం: పల్నాడు జిల్లాలోని గుత్తికొండ గ్రామం సమీపంలో ఈ అద్భుతమైన సహజ సిద్ధమైన గుహ ఉంది. ఇది మాచర్ల ప్రాంతానికి సుదూరంలో, అడవులు మరియు గుట్టల మధ్య విస్తరించి ఉంది.స్వరూపం: ఇదొక పెద్ద భూగర్భ గుహ. దీని లోపలికి వెళ్తే దట్టమైన చీకటి, పెద్ద పెద్ద బండరాళ్లు, నిశ్శబ్దం కనిపిస్తాయి.దీనిలోపలకొన్నికిలోమీటర్లమేర ప్రయాణించవచ్చని, లోపల విశాలమైన గదులు ఉన్నాయని స్థానికులు చెబుతుంటారు.బ్రహ్మనాయుడి తపస్సు మరియు ఋషుల చరిత్ర పల్నాటి యుద్ధ చరిత్రతో ముడిపడి ఉన్న ప్రముఖ నాయకుడు శ్రీ బ్రహ్మనాయుడు ఈ ప్రాంతంలో తపస్సు చేశారని, వైదిక ఋషులు, మునులు ఇక్కడ ధ్యానం చేశారని ప్రతీతి.యుద్ధ తంత్రాల కోసం, ఆధ్యాత్మికసాధన కోసం బ్రహ్మనాయుడు మరియుఆయనఅనుచరులుఈగుహలనురహస్యకేంద్రాలుగాఉప యోగించుకున్నట్లుస్థానికకథనాలుచెబుతున్నాయి.గుహలోపలదే వతామూర్తుల ఆకారాలను పోలిన రాళ్లు, సహజ సిద్ధంగా ఏర్పడిన శివలింగాలు భక్తులను ఆశ్చర్యపరుస్తాయి.

అమరావతికి రహస్య సొరంగ మార్గాలు ఉన్నాయా?

పల్నాడు ప్రాంతంలో ప్రచారంలో ఉన్న అత్యంత ప్రధానమైన నమ్మకం ఏమిటంటే...ఈగుత్తికొండబిలం గుహల నుండి నాటి బౌద్ధ క్షేత్రం మరియు రాజధాని అయిన అమరావతి వరకు మరియు కొండవీడు, పెదకూరపాడు వంటి చారిత్రక ప్రాంతాల వరకు భూగర్భ సొరంగ మార్గాలు ఉన్నాయని అంటారు.నాటి



ఈ చిత్రంలో గుహ లోపలి దట్టమైన రాతి నిర్మాణాలు మరియు చీకటితో కూడిన సహజ సిద్ధమైన మార్గాన్ని గమనించవచ్చు:



కాలంలో శత్రువుల కంట పడకుండా రాజులు, సైన్యాధిపతులు ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి సురక్షితంగా ప్రయాణించడానికి ఈ సొరంగాలను వాడేవారని పెద్దలు చెబుతుంటారు.అయితే, ఈ గుహలు చాలా ప్రమాదకరమైనవి కావడం, లోపల గాలి సరిగ్గా ఆడకపోవడం, విషసర్పాలు, వన్యప్రాణుల సంచారం ఉండే అవకాశం ఉండటంతో సాధారణ ప్రజలు ఒంటరిగా లోపలికి వెళ్లడం చట్టరీత్యా మరియు భద్రతాపరంగా చాలా ప్రమాదకరం.పర్యాటక రంగానికి అందని రహస్యాలుచారిత్రక ప్రాధాన్యం ఉన్న ఈ గుత్తికొండ బిలాన్ని సరైన రీతిలో అభివృద్ధి చేస్తే పల్నాడు ప్రాంతం గొప్ప పర్యాటక కేంద్రంగా మారుతుంది. అయితే సరైన సౌకర్యాలు, నిఘా లేకపోవడం వల్ల ఈ అద్భుతమైన భూగర్భ రహస్యాలు ఇప్పటికీ పూర్తిగా వెలుగులోకి రాలేదు. చరిత్రపై ఆసక్తి ఉన్నవారు, సాహస యాత్రికులు మాత్రం ఈ ప్రాంతాన్ని సందర్శించడానికి తరచూ వస్తుంటారు.

అమ్మ ఓం కేర్ సర్వీస్ నాలుగు రాష్ట్రాలలో విచారిస్తుంది, అది తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక

పెన్ పవర్ ,నవంబర్ 03:

అమ్మ ఓం కేర్ సర్వీసులో ఇంటి పని, వంట పని, శ్రీమంతుల ఇళ్లల్లో బేబీ కేర్స్, ముసలి వాళ్ళకి ఎంతో శ్రద్ధగా సేవలు అందించబడును. "మానవ సేవే మాధవ సేవే" అనే నినాదంతో, మంచితనం, మానవత్వంతో ఈ సర్వీసును ఒక పద్ధతిగా, అందరికీ సరైన సౌకర్యాలతో, సకాలంలో సమృద్ధిగా ఈ ఓం కేర్ సర్వీస్ అందరికీ అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించడం జరిగింది. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నమ్మకమైన మరియు నాణ్యమైన సేవలను అందించడమే మా సంస్థ ముఖ్య ఉద్దేశం.ఈ సర్వీసు కావాల్సిన వారు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు:9533979054, 8332928914

నిర్మల్‌లో బీజేపీ మహా పాదయాత్రలో ముఖ్య నేతలతో కలిసి పాల్గొన్న మెట్పల్లి బిజెపి నాయకులు సురభి నవీన్ కుమార్...

పెన్ పవర్ ,నవంబర్ 03:

ఆదిలాబాద్ జిల్లా నిర్మల్ పట్టణంలో ఈరోజుబీజేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహా పాదయాత్రలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు, కోరుట్ల నియోజకవర్గ నాయకులు సురభి నవీన్ కుమార్ పాల్గొన్నారు.ఈ మహా పాదయాత్రకు ముఖ్య అతిథులుగా హాజరైన బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి శ్రీ సునీల్ బన్సల్, తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు శ్రీ ఎన్. రామచందర్ రావు, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి శ్రీ బండి సంజయ్ కుమార్, మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు శ్రీ ఈటల రాజేందర్, తెలంగాణ శాసనసభ పక్ష నేత, నిర్మల్ ఎమ్మెల్యే శ్రీ ఏలేటి మహేశ్వర్‌రెడ్డిలతోకలిసిసురభినవీన్‌కుమార్‌మహాపాదయాత్ర లోపాల్గొన్నారు.ఈ సందర్భంగా పార్టీ అ గ్ర నాయకులతో కలిసి పాదయాత్రలో అడుగులు వేస్తూ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం



నింపారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు బీజేపీ కౌన్సిలర్లు, పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తల సమిష్టి భాగస్వామ్యంతో మహా పాదయాత్ర ఉత్సాహంగా కొనసాగింది.

విద్య అనేది ప్రతి ఒక్కరి జీవితంలో వెలుగులు నింపే ఆయుధం. అలాంటి విద్యకు చేయూతనిస్తూ, భావితరాల ఒక గొప్ప సేవా సంకల్పం...

పెన్ పవర్ ,నవంబర్ 03:

దేశంలో ఎంతో మంది వద్ద డబ్బు ఉన్న అది ఖర్చు చేయలేక చనిపోతున్న వారెందరో వృద్ధ వయసులో కన్నా కొడుకు సొంత పిల్లలు కూడా దగ్గరికి రానిచ్చే విధంగా ఉన్న ఎవరికి దానం చేయక అన్ని దానాల కన్నా విద్యదానం చేయాలి ఉన్న మహనీయుడు కొత్త జయపాల్ రెడ్డి గారి అమ్మమ్మ గ్రామమైన జగిత్యాల జిల్లా మల్యాల మండలం తక్కళ్లపల్లి, ప్రభుత్వ పాఠశాల నిర్మాణం చేయడం ఒక గొప్ప సేవా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

ఎన్నో ఏళ్ల క్రితం విద్యార్థుల భవిష్యత్తును భూమిని విరాళంగా అందించిన అమ్మమ్మ, తాతయ్యల సేవలను స్మరించుకుంటూ ముందుకు సాగారు.ఆ పాఠశాల 75 వసంతాలు పూర్తి చేసుకున్న ఈ ప్రత్యేక సందర్భంలో, పాత పాఠశాల భవనాన్ని తొలగించి, తన సొంత ఖర్చులతో నూతన పాఠశాల భవనాన్ని నిర్మించాలనే సంకల్పంతో కొత్త జయపాల్ రెడ్డి అన్న భూమిపూజ చేసి పునర్నిర్మాణ పనులను ప్రారంభించారు.

తన కుటుంబం విద్య కోసం అందించిన భూమిలోనే, నేటి విద్యార్థులకు మెరుగైన విద్యా వసతులు కల్పించేందుకు ముందుకు రావడం ఎంతో ప్రత్యేకమైన విషయం.

విద్య అనేది ప్రతి ఒక్కరి జీవితంలో వెలుగులు నింపే ఆయుధం.



అలాంటి విద్యకు చేయూతనిస్తూ, భావితరాల భవిష్యత్తుకు బాటలు వేయాలనే మీ ఆలోచన ఎందరికో స్ఫూర్తిదాయకం అన్నా!ఆ కుటుంబం నాడు విద్య కోసం భూమిని అందిస్తే... మీరు నేడు అదే పాఠశాలకు కొత్త రూపాన్ని అందిస్తున్నారు. ఇది నిజంగా తరతరాలు గుర్తుంచుకునే సేవ! తక్కలపల్లి గ్రామ ప్రజలు కొత్తపెళ్లి జయప్రకాష్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు

"ఏ అధికారి వచ్చిన చూచు మంత్రంగా అధికారులము వాచ్చామా చూసామా పోయావా" అనే విధంగా గురుకుల పాఠశాలలు"

పెన్ పవర్ ,నవంబర్ 03:

సంక్షేమ వసతి గృహాలు గురుకుల పాఠశాలలు మంచిగానడవాలశీటే ప్రతిరోజు మండల తాసిల్దార్ తప్పుని సరి గురుకుల పాఠశాల సందర్శించి పిల్లలతో కలిసి సహపంక్తి భోజనం చేయాలని ఈ విషయంలో కార్య దర్శిస్థాయి నుండి ఆదేశాలు వెళ్లాలని జిల్లా కలెక్టర్లు కూడా విద్యార్థులు చదువుకొరకై వారి సూచనలు తీసుకొని గురుకులాలు మంచిగా నడుపలి చదువుకోవాలని ఉండి సరైన సౌకర్యాలు లేక ఎంతోమంది పేద పిల్లలు బాధపడుతుండగా ప్రభుత్వాలు వారి కొరకై సంక్షేమ వసతి గృహాలను ఏర్పాటు చేసి దాదాపు 50 సంవత్సరాల నుండి మేజర్ గ్రామపంచాయతీలో మొదలుకొని పట్టణాలలో వసతిగృహాలను గురుకులాలను ఏర్పాటు చేసింది కానీ అందులో షెడ్యూల్ క్యాస్ట్ షెడ్యూల్ ట్రైబల్ వారి కొరకు మొదలు ఏర్పాటు చేశారు అందులో కూడా బీసీ, ఎఫ్ సి, వాళ్లకు కూడా ప్రభుత్వ కొన్ని సీట్లు కేటాయించింది కానీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు దలరుల చేతుల్లో మారిన వసతి గృహ అధికారులు పిల్లలకు సరైన సౌకర్యాలు ఉంచక పై అధికారులకు లంచాలు ఇస్తూ పిల్లలకు నాణ్యమైన భోజనం పెట్టలేక వారికి చదువు చెప్పడంలో కూడా అధికారులు విఫలమయ్యారు



గతంలో వసతి గృహాలు కూడా విద్యార్థులు చదువుకోవడానికి ముందుకొచ్చి చదువుకున్నారు కానీ అధికారులు అలసత్వము లంచాలకు అలవాటు పడి ఎన్ని డబ్బులు మిగులుతున్నాయి అని చూడడమే తప్ప విద్యార్థులను పట్టించుకున్న పాపాన పోలేదు ఇక గతంలో గురుకులాలు ఆంధ్రప్రదేశ్ తెలంగాణ కలిసి ఉన్నప్పుడు ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు ఏపీఎస్ఆర్జెసి అనే గురుకులాలను ఏర్పాటు చేసి అందులో చదువుకున్న విద్యార్థులను ఎంతో అభివృద్ధిలోకి తీసుకురావాలని ఉపాధ్యాయుల కృషి చేశారుఇప్పుడు ఉన్నత అధికారులు పిల్లలకు సరైన ఆహారం అందించలేక పిల్లలు ఎదురు తిరిగితే వారి కొట్టడం ఇలాంటివి అనేకసార్లు జరిగాయి ఇదిలా ఉండగా బిఆర్ఎస్ ప్రభుత్వం వచ్చినంక గురుకులాలు ఏర్పాటు చేశారు ఐదవ తరగతి నుండి డిగ్రీ వరకు ఉచిత విద్యను అందించింది కానీ అందులో కూడా హైదరాబాదులో కార్యదర్శిగా ఉన్నవారి నుండి కింది స్థాయి ఉద్యోగుల వరకు లంచాలతో మీరు ఎంతైనా తినండి కానీ మాకు వచ్చే వాట మాత్రం పంపాలి అని కింది స్థాయి అధికారులకు మా వాటా గింత ఉంటుందని ముందే చెప్తారు ఇందులో సంక్షేమ శాఖ మంత్రి ముఖ్య మంత్రి వరకు లంచాలు వెళ్ళేటివని అందువల్ల "ఏ అధికారి వచ్చిన చూచు మంత్రంగా అధికారులము వాచ్చామా చూసామా పోయావా" అనే విధంగా గురుకుల పాఠశాలలో" జరుగుతున్న అన్యాయాలను ఏ ఒక్క నాయకుడు గాని అధికారులు గానీ మంత్రులని చెప్పడం మాత్రం తెలుసు కానీ వారి ద్వారా పనులు చేయించడం మాత్రం తెలవదు విద్యార్థులు తినే అన్నం చూస్తే పురుగులు పడి నాణ్యత లేకుండా వంట చేయడం మీరు తింటే తినండి లేకుంటే లేదు అని అధికారులు విద్యార్థులపై చేయి చేసుకున్న విధంగా ఉంది ప్రభుత్వం విలాసవంతమైన జీవితం గడిపే విధంగా అన్ని వసతులను ఏర్పాటు చేసిన అధికారులు మాత్రం ఆ వసతులు విద్యార్థులకు అందనివ్వకుండా అడ్డుపడుతున్నారు వారికి కావలసింది లంచాలు లంచాలు ఉన్నత స్థాయి అధికారులకు ఇవ్వాలని చెప్తున్నారు ఇక పిల్లలను ఆ దేవుడే రక్షించాలి

పల్నాడు జిల్లాలోని చారిత్రక శైవక్షేత్రం: దైదా శ్రీ సోమేశ్వర స్వామి ఆలయ విశేషాలు

పెన్ పవర్ ,నవంబర్ 03:

పల్నాడు ప్రాంతం అంటేనే వీరభూమిగా, ఎన్నో చారిత్రక కట్టడాలకు, పవిత్ర పుణ్యక్షేత్రాలకు నిలయంగా ప్రసిద్ధి చెందింది. ఈ ప్రాంతంలో ఆధ్యాత్మిక పరిమళాలు వెదజల్లుతున్న అద్భుతమైన శైవక్షేత్రాలలో మాచర్ల, గురజాల ప్రాంతాల సమీపంలో వెలసిన దైదా గ్రామంలోని శివాలయం (శ్రీ సోమేశ్వర స్వామి ఆలయం) ఒకటి.

ఆలయ పుట్టుపూర్వోత్తరాలు మరియు చరిత్ర

చరిత్రకారులు మరియు స్థానిక పెద్దల కథనాల ప్రకారం, దైదా క్షేత్రం ఎంతో ప్రాచీనమైనది. పల్నాటి యుద్ధ చరిత్రతో మరియు కాకతీయ సామ్రాజ్య కాలంతో ఈ ప్రాంతానికి బలమైన సంబంధాలు ఉన్నాయి. ఇక్కడ వెలసిన శివలింగం సామాన్యమైనది కాదు; ఇది దైవిక శక్తులతో కూడిన పవిత్రమైన పురాతన క్షేత్రంగా విరాజిల్లుతోంది.

స్వయంభూ మూర్తిగా పరమ-శివుడు

ఈ ఆలయంలోని ప్రధాన దైవమైన శివలింగం మానవ ప్రయత్నంతో ప్రతిష్ఠించబడినది కాదని, స్వయంగా వెలసిన స్వయంభూ రూపమని స్థానికుల విశ్వాసం. కాలక్రమేణా దట్టమైన అడవులు, పురాతన కట్టడాల మధ్య మరుగున పడిన ఈ క్షేత్రం మహిమలు భక్తులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. ఇక్కడ కొలువైన శివుడు భక్తుల కొంగుబంగారమై కోరిన కోర్కెలు తీర్చే కొండంత దైవంగా పూజలందుకుంటున్నాడు.

శతాబ్దాల నాటి చారిత్రక నేపథ్యం


ఈ ప్రాంతం వేల సంవత్సరాల నాటి శైవ ఆరాధనకు కేంద్రంగా ఉంటూ వస్తోందని ఇక్కడి శాసనాలు, శిల్పకళా సంపద తెలియజేస్తున్నాయి. నాటి రాజుల కాలంలో ఈ ఆలయం ఎంతో వైభవంగావిరాజిల్లినట్లు తెలుస్తోంది. కాలక్రమంలో దండయాత్రలవల్లకొన్ని కట్టడాలు శిథిలమైనప్పటికీ, భక్తులసహకారంతోఈ ఆలయం పునరుద్ధరించబడి నేడు నిత్య పూజలతో కళకళలాడుతోంది.


ఆలయ విశేషాలు మరియు పూజా కార్యక్రమాలు

మహాశివరాత్రి పర్వదినాన ఈ ఆలయానికి ఉమ్మడి గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల నుంచే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో భక్తులుతరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటారు.

శ్రావణ మాసంలో ప్రతి సోమవారం ప్రత్యేక అభిషేకాలు, రుద్రాభిషేకాలు, విశేష పూజలు ఘనంగా నిర్వహిస్తారు.ఆలయ ప్రాంగణంలో లభించే శిల్పసంపద, నందీగ్రహ విగ్రహాలు నాటి శిల్పకళా చాతుర్యానికి అద్దం పడుతున్నాయి.

పల్నాటినేలలోఆధ్యాత్మికపరిమళాలువిరజిమ్ముతున్న ఈ దైదా శివాలయాన్ని పర్యాటకులు మరియు భక్తులు దర్శించుకోవడం ద్వారా అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయని





భక్తుల నమ్మకం. ఈ చారిత్రక ఆలయాన్ని ప్రభుత్వం మరియు దేవాదాయ శాఖ మరింత అభివృద్ధి చేసి ప్రముఖ శైవక్షేత్రంగా తీర్చిదిద్దాలని స్థానికులు కోరుతున్నారు.

నాలుగు వేదాలు: రుగ్వేదం, సామవేదం, యజుర్వేదం, అథర్వణ వేదం -- వాటి విశిష్ట విధానాలు!

పెన్ పవర్ ,నవంబర్ 03:

అమరావతి:

మన భారతీయ సంస్కృతికి, సనాతన ధర్మానికి మూలమైన నాలుగు వేదాలు మానవుల చేత సృష్టించబడినవి కావు. సృష్టి ఆరంభంలో పరమాత్మ నిశ్వాసాల నుండి, బ్రహ్మదేవుని చతుర్ముఖాల నుండి ఇవి వెలువడ్డాయి. మానవాళికి ధర్మాన్ని, సత్ప్రవర్తనను బోధించడానికి ఉద్భవించిన ఈ నాలుగు వేదాల వెనుక దాగి ఉన్న ప్రత్యేక చరిత్ర మరియు వాటి విధి విధానాలు ఇప్పుడు వివరంగా చూద్దాం.

1. రుగ్వేదం - స్తుతి మరియు జ్ఞాన విధానం

వేదం వెలువడిన విధానం: సృష్టి ప్రారంభ దశలో విశ్వమంతా నిశ్శబ్దంగా ఉన్న సమయంలో పరబ్రహ్మ సంకల్పం వల్ల తొలిసారిగా వెలువడిన శబ్ద రూపమే రుగ్వేదం. బ్రహ్మదేవుడు తన తూర్పు ముఖం నుండి ఈ వేదాన్ని వెలువరిచాడు.

ప్రధాన విధి: పరమాత్ముని, ప్రకృతిలోని శక్తులను (అగ్ని, వరుణుడు, ఇంద్రుడు మొదలైన దేవతలను) స్తుతించడం, మంత్రాల ద్వారా దివ్య శక్తులను ఆహ్వానించడం ఈ వేదం యొక్క ముఖ్య విధి.

జీవిత విధానం: ఇది మనుషులకు జ్ఞానాన్ని, సత్య మార్గాన్ని, సృష్టి రహస్యాలను బోధిస్తుంది. నిత్య జీవితంలో భగవన్నామ స్మరణ, సత్యసంధమైన ఆలోచనలు కలిగి ఉండటాన్ని ఈ వేదం విధిగా నేర్పుతుంది.

2. యజుర్వేదం - కర్మ మరియు యజ్ఞ విధానం

వేదం వెలువడిన విధానం: బ్రహ్మదేవుని దక్షిణ ముఖం నుండి యజుర్వేదం ఉద్భవించింది. యజ్ఞయాగాదులలో ఆచరించాల్సిన పద్ధతులను తెలియజేయడానికి ఇది వెలువడింది.

ప్రధాన విధి: యజ్ఞాలు, యాగాలు, హోమాలు ఏ విధంగా నిర్వహించాలి అనే దానిపై స్పష్టమైన నియమ నిబంధనలను (కర్మ కాండను) ఇది సూచిస్తుంది.

జీవిత విధానం: సమాజ శ్రేయస్సు కోసం, ప్రకృతి సమతుల్యత కోసం చేసే క్రతువులలో ఏ మంత్రం ఎలా ఉపయోగించాలి, ఏ ఆచారాలు పాటించాలి అనే కర్మ



మార్గాన్ని ఇది మానవాళికి విధిగా నిర్దేశించింది.

3. సామవేదం – సంగీత మరియు ఉపాసనా విధానం

వేదం వెలువడిన విధానం: బ్రహ్మదేవుని పశ్చిమ ముఖం నుండి సామవేదం ఆవిర్భవించింది. భక్తి భావంతో దేవుని కీర్తించడానికి ఇది మార్గదర్శకమైంది.

ప్రధాన విధి: మంత్రాలను రాగయుక్తంగా, సంగీత రూపంలో గానం చేయడం ఈ వేదం యొక్క ప్రధాన విధి. సామవేదమే భారతీయ సంగీతానికి మూలము.

జీవిత విధానం: భగవంతుని నామస్మరణను, వేద మంత్రాలను భక్తిభావంతో గానం చేస్తూ మనసును ప్రశాంతంగా ఉంచుకునే ఉపాసనా మార్గాన్ని ఇది బోధిస్తుంది. భక్తి ద్వారా మోక్షం పొందే విధానాన్ని ఇది తెలియజేస్తుంది.

4. అథర్వణ వేదం – ఆరోగ్య, రక్షణ మరియు లౌకిక విధానం

వేదం వెలువడిన విధానం: బ్రహ్మదేవుని ఉత్తర ముఖం నుండి అథర్వణ వేదం వెలువడింది. లౌకిక జీవితానికి, భద్రతకు అవసరమైన విజ్ఞానాన్ని ఇది అందించింది.ప్రధాన విధి: లౌకిక జీవితానికి కావలసిన వైద్య విధానం (ఆయుర్వేదం), శారీరక-మానసిక ఆరోగ్యం, సమాజ రక్షణ, మరియు విపత్తుల నుండి కాపాడుకునే విధులను ఇది బోధిస్తుంది.

జీవిత విధానం: కేవలం ఆధ్యాత్మికత మాత్రమే కాకుండా, నిత్య జీవితంలో ఎదురయ్యే రుగ్మతలను, సమస్యలను ఎదుర్కొనే మార్గాలను, శాంతిని చేకూర్చే విధులను ఈ వేదం స్పష్టంగా వివరిస్తుంది.నాలుగు వేదాలు: రుగ్వేదం, సామవేదం, యజుర్వేదం, అథర్వణ వేదం -- వాటి విశిష్ట విధానాలు!

య్యే రుగ్మతలను, సమస్యలను ఎదుర్కొనే మార్గాలను, శాంతిని చేకూర్చే విధులను ఈ వేదం స్పష్టంగా వివరిస్తుంది.

పెన్ పవర్

కుల్‌దీప్‌కు అవకాశాలివ్వకపోవడం మిస్టరీ.. టీమ్ మేనేజ్‌మెంట్‌పై మాజీ స్పిన్నర్ అసంతృప్తి

- కుల్‌దీప్‌కు అవకాశాలివ్వకపోవడంపై మణీందర్ సింగ్ అసంతృప్తి
- అన్ని ఫార్మాట్లలోనూ రాణించగల సత్తా కుల్‌దీప్‌కు ఉందని వ్యాఖ్య
- జట్టు మేనేజ్‌మెంట్‌కు అతడి సామర్థ్యంపై తగినంత నమ్మకం లేదని వ్యాఖ్య
- గతంలో మురళీ కార్తీక్ కూడా బాగా బౌలింగ్ చేసినా అప్పటి కెప్టెన్లు సరైన అవకాశాలివ్వలేదని ఆరోపణ
- న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌లోనైనా కుల్‌దీప్‌కు అవకాశం దక్కుతుందా అనేది ఆసక్తికరం



భారత స్టార్ స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్‌కు జట్టులో క్రమం తప్పకుండా అవకాశాలు ఇవ్వకపోవడంపై మాజీ స్పిన్నర్ మణీందర్ సింగ్ అసంతృప్తి వ్యక్తం చేశాడు. అతడికి తగినన్ని అవకాశాలు ఎందుకు రావడం లేదో తనకు ఇప్పటికీ మిస్టరీగానే ఉందన్నాడు. అన్ని ఫార్మాట్లలోనూ రాణించగల సత్తా కుల్‌దీప్‌కు ఉందని, అతడి బౌలింగ్‌లో వైవిధ్యం ఉందని పేర్కొన్నాడు. జట్టు మేనేజ్‌మెంట్‌కు అతడి సామర్థ్యంపై తగినంత నమ్మకం లేదని, అందుకే తరచూ పక్కన పెడుతున్నారని మణీందర్ అభిప్రాయపడ్డాడు. న్యూజిలాండ్‌తో ఇటీవల ముగిసిన టీ20 సిరీస్‌లో భారత్ 3-2తో గెలిచినా కుల్‌దీప్‌కు ఒక్క మ్యాచ్‌లోనూ అవకాశం దక్కలేదు. 124 వన్డేల్లో 201 వికెట్లు తీసిన అతడు.. ప్రస్తుతం భారత జట్టులో ఉన్న బౌలర్లందరి కంటే ఎక్కువ వికెట్లు సాధించాడు.గతంలో ఇంగ్లాండ్‌తో జరిగిన టెస్టు సిరీస్‌లో కుల్‌దీప్‌కు ఐదు మ్యాచ్‌ల్లోనూ అవకాశం ఇచ్చి ఉంటే భారత్ 3-1తో గెలిచేదని తాను భావించానని మణీందర్ చెప్పాడు. అతడిపై తనకు అంతటి నమ్మకం ఉందన్నాడు. గతంలో మురళీ కార్తీక్ కూడా బాగా బౌలింగ్ చేసినా.. కెప్టెన్లు సౌరవ్ గంగూలీ, రాహుల్ ద్రవిడ్ అతడిపై తగినంత విశ్వాసం చూపలేదని గుర్తుచేశాడు. ఇప్పుడు కుల్‌దీప్ విషయంలోనూ అలాంటి పరిస్థితే కనిపిస్తోందని వ్యాఖ్యానించాడు. ప్రపంచ క్రికెట్‌లో ఎడమచేతి మణికట్టు స్పిన్నర్లు అరుదుగా ఉంటారని, అలాంటి బౌలర్‌కు నిరంతరం అవకాశాలు ఇచ్చి ప్రోత్సహించాలని సూచించాడు. న్యూజిలాండ్‌తో బుధవారం నుంచి ప్రారంభమయ్యే ఐదు వన్డేల సిరీస్‌లోనైనా కుల్‌దీప్‌కు అవకాశం దక్కుతుందా? అన్నది ఆసక్తికరంగా మారింది. ఈ ఏడాది భారత్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో న్యూజిలాండ్ బ్యాటర్ డారిల్ మిచెల్.. కుల్‌దీప్‌పై ఆధిపత్యం ప్రదర్శించాడు. మూడు మ్యాచ్‌ల్లో కుల్‌దీప్ మూడు వికెట్లే తీశాడు. అయితే న్యూజిలాండ్ పిచ్‌లపై బౌలర్లకు కొంత సహకారం లభించే అవకాశం ఉండటంతో కుల్‌దీప్ తన సామర్థ్యాన్ని నిరూపించుకునేందుకు ఇది మంచి అవకాశమని భావిస్తున్నారు.

భారత్ ఐం న్యూజిలాండ్ తొలి వన్డే.. పిచ్ రిపోర్ట్, నేడు వెదర్ రిపోర్ట్ ఇదే!



టీ20 సిరీస్‌ను 3--2 తేడాతో కైవసం చేసుకుని జోరుమీదున్న టీమిండియా, ఇప్పుడు అసలు సిసలైన వన్డే పోరుకు సమాయత్తమైంది. భారత్ వర్సెస్ న్యూజిలాండ్ జట్ల మధ్య ఐదు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో భాగంగా (2026, నవంబర్ 4, బుధవారం) తొలి వన్డే జరగనుంది. ఆక్లాండ్‌లోని ఈడెన్ పార్క్ వేదికగా జరిగే ఈ మ్యాచ్‌లో శుభ్‌మన్ గిల్ ఇండియన్ టీమ్ కు సారథ్యం వహిస్తుండగా, కివీస్ జట్టును మిచెల్ శాంట్నర్ నడిపించనున్నాడు. అయితే తొలి మ్యాచ్‌పై వర్షం ప్రభావం ఎంత వరకు ఉంది? పిచ్ ఎలా ఉండబోతోంది? అన్న అంశాలనింటిని ఇప్పుడు తెలుసుకుందాం..

ఆక్లాండ్‌లో వర్షం.. మ్యాచ్ జరుగుతుందా?:

క్రికెట్ ప్రేమికులకు కాస్త ఊరటనిచ్చే ముచ్చట ఏంటంటే.. ఈ మ్యాచ్‌కు వాతావరణం దాదాపు అనుకూలించే అవకాశాలే కనిపిస్తున్నాయి. ఆక్యూ వెదర్ నివేదిక ప్రకారం ఆక్లాండ్‌లో ఉదయం పూట వర్షం కురిసే అవకాశం 56 శాతంగా ఉంది. ఇక స్థానిక కాలమానం ప్రకారం మధ్యాహ్నం 2:00 గంటలకు (భారత కాలమానం ప్రకారం ఉదయం 7:30 గంటలకు) మ్యాచ్ ప్రారంభం కానుంది. ఆ సమయానికి ఆకాశం మేఘావృతమై ఉన్నప్పటికీ వర్షం తగ్గుముఖం పడుతుందని వాతావరణ శాఖ అంచనా వేసింది. కాబట్టి మ్యాచ్‌కు పెద్దగా అంతరాయం కలగకపోవచ్చు.. ఉష్ణోగ్రతలు 17 నుంచి 19 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదు కానున్నాయి.

పిచ్ రిపోర్ట్:

ఈడెన్ పార్క్ పిచ్ సాధారణంగా బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉంటుంది. దీంతో ఇరు జట్లు ఇక్కడ భారీగా పరుగులు చేసే ఛాన్స్ ఉంది.

చిన్న బౌండరీలు: ఈ మైదానంలో బౌండరీలు చాలా చిన్నవి కావడంతో బ్యాటర్లు సిక్సర్లు, ఫోర్లతో విరుచుకుపడే అవకాశం ఎక్కువగా కనిపిస్తోంది.

స్పింగ్ ఎఫెక్ట్: కొత్త బంతితో మొదటి కొన్ని ఓవర్లలో ఫాస్ట్ బౌలర్లకు కొంచెం స్పింగ్ లభించినప్పటికీ, ఓవరాల్‌గా ఇది హై-స్కోరింగ్ మ్యాచ్ అయ్యే సూచనలు కనిపిస్తున్నాయి.

హిస్టారికల్ రికార్డ్: 2026, సెప్టెంబర్ 27వ తేదీన జరిగిన నాలుగో టీ20 మ్యాచులో ఇదే ఈడెన్ పార్క్ మైదానంలో న్యూజిలాండ్ టీమిండియాపై భారీ విజయం సాధించింది. అప్పట్లో కివీస్ 259/7 స్కోరు చేయగా, భారత్‌ను 172 పరుగులకే ఆలౌట్ చేసి 87 పరుగుల తేడాతో గెలుపొందింది. మరీ చూడాలి ఆ మ్యాచ్ కి ప్రతీకారం తీర్చుకుంటుందో లేదో.

సొంత ఖర్చుతోనే సింధు, లక్ష్యసేన్ విజయాలు.. భారత షట్లర్లకు నిధుల కష్టాలు!

- యూరప్ పర్యటనకు నిధులు విడుదల చేయని సాయ్
- ఆటగాళ్లే ప్రయాణం, భోజనం, వసతి ఖర్చులు భరించిన వైనం
- కొందరు ఆటగాళ్లు కోచ్‌లు లేకుండానే పోటీల్లో పాల్గొన్న దుస్థితి
- గడువులోగా ప్రతిపాదన ఇవ్వలేదని సాయ్ వివరణ
- ఆసియా క్రీడల ఫలితాల వల్లే నిధులు ఆగాయన్న వాదనను ఖండించిన సాయ్



భారత బ్యాడ్మింటన్ స్టార్లు పీవీ సింధు, లక్ష్యసేన్ యూరప్ పర్యటనలో టైటిళ్లు గెలిచి సత్తా చాటారు. అయితే ఆ టోర్నీలకు వెళ్లేందుకు అవసరమైన ఖర్చుల విషయంలో వాళ్లు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఫిన్లాండ్, డెన్మార్క్, ఫ్రాన్స్, జర్మనీల్లో జరిగిన నాలుగు టోర్నీలకు భారత క్రీడా ప్రాధికార సంస్థ (సాయ్) నిధులు విడుదల చేయలేదని సమాచారం. 'ఇండియన్ ఎక్స్ ప్రెస్'ను ఉటంకిస్తూ 'ఇండియా టుడే' కథనం ప్రకారం.. ప్రయాణం, భోజనం, వసతి ఖర్చులను ఆటగాళ్లే భరించాల్సి వచ్చింది. నిధులు అందకపోవడంపై ఆశ్చర్యం వ్యక్తం చేసిన సింధు.. కొంత ఖర్చును తానే భరించానని, ఒలింపిక్ గోల్డ్ క్వెస్ట్ సంస్థ కూడా సాయం చేసిందని తెలిపింది.నిధుల కొరత ప్రభావం ఆటగాళ్ల సహాయక సిబ్బందిపైనా పడింది. కోచ్‌ల ఖర్చులు భరించలేక కొందరు వారిని వెంట తీసుకెళ్లలేకపోయారు. ఫ్రెంచ్ ఓపెన్‌లో అమ్మితా చాలిహా, డెన్మార్క్ ఓపెన్‌లో తన్వీ శర్మ కోచ్ సహాయం లేకుండానే పోటీపడ్డారు. నిధులు నిలిచిపోవడానికి కారణంపై భిన్న కథనాలు వెలువడ్డాయి. ఆసియా క్రీడల్లో భారత బ్యాడ్మింటన్ జట్టు ప్రదర్శన దీనికి కారణమై ఉండొచ్చని కొందరు అనుమానించినా.. ఆ వాదనను సాయ్ అధికారి ఖండించారు. టోర్నీలకు 30 రోజుల ముందుగా సమర్పించాల్సిన ప్రతిపాదనను బ్యాడ్మింటన్ సంఘం (బీఏఐ) గడువులోగా ఇవ్వకపోవడంతో నిధులు విడుదల కాలేదని వివరించారు. నిధుల ఇబ్బందుల నేపథ్యంలోనూ భారత ఆటగాళ్లు మంచి ఫలితాలు సాధించారు. జర్మనీలో జరిగిన హైలో ఓపెన్‌లో లక్ష్యసేన్ పురుషుల సింగిల్స్ టైటిల్ గెలవగా, సింధు మహిళల సింగిల్స్ విజేతగా నిలిచింది. ఈ ఏడాది ఆమెకు ఇది రెండో టైటిల్. మరోవైపు, రాబోయే టోర్నీలకు నిధుల సాయం పునరుద్ధరిస్తామని సాయ్ తెలిపినట్లు 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' పేర్కొంది. అయితే యూరప్ పర్యటనలో ఆటగాళ్లు స్వయంగా పెట్టుకున్న ఖర్చులను తిరిగి చెల్లించబోమని స్పష్టం చేసినట్లు తెలిపింది.



'పాన్ ఇండియా' ఎవరు మొదలు పెట్టారు? 'కింగ్ నాగార్జున'పై సూర్య ఆసక్తికర వ్యాఖ్యలు





నేటి సినీ పరిశ్రమలో -పాన్-ఇండియా- అనే పదం ఎంతో ప్రాచుర్యం పొందింది. ప్రతీ ఒక్కరూ బహు భాషలలో సినిమాలు చేస్తూ సరిహద్దులు చెరిపేస్తున్న వేళ.. ఈ ట్రెండ్‌ను దశాబ్దాల క్రితమే ప్రారంభించిన మార్గదర్శి గురించి కోలీవుడ్ స్టార్ హీరో సూర్య చేసిన వ్యాఖ్యలు ఆసక్తిని రేకెత్తించాయి. అసలు పాన్ ఇండియా సినిమాని సౌత్ లో ప్రారంభించింది ఎవరో సూర్య క్లారిటీ గా చెప్పారు.టాలీవుడ్ సీనియర్ హీరో -నాగ్ సర్- దీనికి ఆద్యుడు అని సూర్య వ్యాఖ్యానించారు. తన కొత్త చిత్రం -సీన్- ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో పాల్గొన్న సూర్య నేరుగా నాగార్జునపై ప్రశంసల జల్లు కురిపించారు. నాగ్ సర్ ఇతర భాషల దర్శకులతో పని చేయడమే కాకుండా..స్వయంగా పోరుగు పరిశ్రమలలో నటిస్తూ పాన్ ఇండియా ట్రెండ్ సెట్టర్‌గా నిలిచారని కీర్తించారు.నాగార్జున పాన్-ఇండియా విజన్ గురించి సూర్య ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ ఆసక్తికర అంశాలను వెల్లడించారు. నేడు ట్రెండ్‌గా మారిన పాన్-ఇండియా కాన్సెప్ట్‌ను నాగ్ సర్ ఎప్పుడో ముందే ఆచరణలో పెట్టారని అన్నారు. మణిరత్నం, ఫాజిల్, ప్రియదర్శన్ వంటి ఇతర భాషల దిగ్గజ దర్శకులతో కలిసి పనిచేస్తూ పోరుగు సినీ పరిశ్రమలను అనుసంధానించడంలో నాగార్జున ఎప్పుడూ ముందున్నారని చెప్పారు. మంచి సినిమాను, వైవిధ్యమైన కంటెంట్‌ను ఎల్లప్పుడూ ఆదరించే నాగ్ తత్వమే తనకు ప్రధాన స్ఫూర్తి అని సూర్య కొనియాడారు.అభిమానుల కోలాహలం మధ్య జరిగిన ఈ వేడుకలో సూర్య భావోద్వేగంతో మాట్లాడుతూ.. తమ మధ్య ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. అభిమానులు చూపిస్తున్న అన్‌లిమిటెడ్ ప్రేమకు తాను ఎప్పటికీ రుణపడి ఉంటానని.. --మనమంతా ఒకే కుటుంబం- అని పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం తమ పనులన్నీ పక్కన పెట్టి.. సభకు భారీ సంఖ్యలో తరలివచ్చిన అభిమానులకు, భద్రతా సిబ్బందికి .. మీడియా ప్రతినిధులకు సూర్య ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

ఇక అభిమానులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న -రోలెక్స్- సినిమా గురించి సూర్య ఆసక్తికరమైన అప్‌డేట్ ఇచ్చారు. --స్క్రీన్ పై హీరోనా, విలనా? ఎవరు బెటర్ అంటే.. విలన్ పాత్రే చాలా బెటర్! ఇప్పటివరకు చాలా మంది హీరోలు వచ్చారు... ఇప్పుడు ఒక పవర్‌ఫుల్ విలన్ రావాల్సిన అవసరం ఉంది. దర్శకుడు లోకేష్ కనగరాజ్‌ను నన్ను కలవమని చెప్పండి.. త్వరలోనే రోలెక్స్ ప్రాజెక్ట్‌ను మనం సాధ్యం చేద్దాం-- అంటూ సూర్య చేసిన వ్యాఖ్యలు ఫ్యాన్స్‌లో విపరీతమైన జోష్ నింపాయి.అలాగే తాను నటించిన -సీన్- చిత్రంలోని ఒక శక్తివంతమైన మెసేజ్ ని తన డైలాగుల్లో చెప్పారు.--ఐ యామ్ ది బెస్ట్.. ఐ కెన్ డు ఎనీథింగ్-- (నేనే బెస్ట్.. నేను ఏదైనా చేయగలను) అనే డైలాగ్ ఇతరులతో పోటీపడేందుకు కాదని.. మనపై మనకు నమ్మకం పెంచుకోవడానికేనని చెప్పారు. తాను కూడా ఒకప్పుడు ఎంతో సాధారణమైన ఇంట్రోవర్ట్ వ్యక్తిగా ఉండేవాడినని..తనకే ఇది సాధ్యమైనప్పుడు ప్రతి ఒక్కరూ సాధించగలరని భరోసా ఇచ్చారు. నాగార్జునపై సూర్య చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి.



స్టైలిష్ బ్లూ డెనిమ్ జంప్‌సూట్ లో మెరిసిపోయిన ఐషా శర్మ - ఫోటోషూట్

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publishers Flat No : 504, Bharat Towers, 5th Lane Dwarakanagar, Visakhapatnam, Andhra Pradesh - 530016, And Published At FLAT NO. 31, RAJEEV NAGAR, VISAKHA A COLONY, NEAR JAMATHOTA, KILLIPALEM PANCHAYAT, PATHAPATNAM, SRIKAKULAM DIST. "PEN POWER" vide PRGI Registration No. "APTEL/25/A4918" Editor: GANTYADA APPARAO. e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965PANCHAYAT, PATHAPATNAM, SRIKAKULAM DIST. Editor GANTYADA APPARAO.e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965